ప్రజాశక్తి
మంగళవారం 26 నవంబర్ 2024 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

జిల్లా రోడ్లపైనా టోల్ బాదుడు!

- ఉమ్మడి గుంటూరు జిల్లాలో నాలుగు రహదారులు ఎంపిక
- గుంటూరు-పర్చూరు, తెనాలి-మంగళగిరి, నారాకోడూరు-తెనాలి, గుంటూరు-బాపట్లకు అంగీకారం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజలకు షాక్ తగిలే మరో నిర్ణయాన్ని ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటికే పలు మార్గాల్లో టోల్ గేట్ల వద్ద ఛార్జీలు చెల్లించలేక అల్లాడుతున్న ప్రజలకు మరో పిడుగుపాటు వార్త అందింది. జిల్లాలోని నాలుగు మార్గాల్లో రోడ్ల అభివృద్ధిని ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టాలని నిర్ణయించారు. ఇందుకు ప్రతిగా ఈ సంస్థలు ప్రజల నుంచి టోల్ ఫీజులు వసూలుకు ప్రభుత్వం సోమవారం సూచన ప్రాయంగా అంగీకారం తెలిపింది. సోమవారం సిఎం చంద్రబాబు నిర్వహించిన సమీక్షల్లో రహదారులు, భవనాల శాఖ అధికారులు చేసిన ఈ ప్రతిపాదనకు అంగీకారం లభించింది. రాష్ట్రంలో 18 రహదారులను ఎంపిక చేయగా ఇందులో నాలుగు జిల్లాలో ఉండటం గమనార్హం. అయితే రాజధానికి వెళ్లే మార్గాల్లో మాత్రం టోల్ గేట్లు ఏర్పాటుకు ప్రభుత్వం అంగీకారం తెలపలేదు. పూర్తిగా గ్రామీణ ప్రాంత వాసులు ప్రయాణించే మార్గాల్లోనే టోల్ గేట్ల ఏర్పాటుకు పచ్చజెండా ఊపారు. అయితే ట్రాక్టర్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలకు మాత్రం మినహాయింపు ఇస్తున్నారు.



ఇప్పటికే గుంటూరు -విజయవాడ మార్గంలో జాతీయ రహదారిపై దాదాపు 25 ఏళ్లుగా టోల్‌గేట్ కొనసాగుతోంది. పిడుగురాళ్ల మండలం తుమ్మలచెరువు వద్ద అద్దంకి-నార్కెట్‌పల్లి రహదారిపైనా ఒక టోల్‌గేట్, ఇదే రహదారి సంతమాగులూరు అడ్డరోడ్డ వద్ద మరో టోల్‌గేటు ఉంది. గుంటూరు, కృష్ణా జిల్లా సరిహద్దులో పెనుమూడి వద్ద మరో టోల్‌గేటు కొనసాగుతున్నాయి. తాజాగా గుంటూరు-పర్చూరు, గుంటూరు-బాపట్ల, మంగళగిరి-తెనాలి, నారా కోడూరు-తెనాలి రహదారులను ప్రైవేటు సంస్థల భాగస్వామ్యం (పిపిపి) పద్ధతిలో అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. గుంటూరు-పర్చూరు మధ్య 41.44 కిలోమీటర్లు, గుంటూరు-బాపట్ల మధ్య 51.24 కిలోమీటర్లు, మంగళగిరి-తెనాలి మధ్య 27 కిలోమీటర్లు, తెనాలి-నారాకోడూరు మధ్య 13 కిలో మీటర్ల రహదారులను అభివృద్ధి చేసి ఈ మార్గాల్లో టోల్ సుంకం వసూలు చేయనున్నారు. ఈ మార్గాల్లో ప్రస్తుతం ఏడు నుంచి 10 మీటర్ల రహదారులు మాత్రమే ఉన్నాయి. వీటిని 14 నుంచి 20 మీటర్ల రహదారులుగా విస్తరించి రెండు వరసలుగా అభివృద్ధి చేయాలని యోచిస్తున్నారు. ఇందుకయ్యే ఖర్చు ప్రైవేటు సంస్థలు భరిస్తాయి.

ఇప్పటికే ఏడు నుంచి 10 మీటర్ల వరకు రహదారులు పటిష్టంగా ఉండగా ఇటీవల కాలంలో నిర్వహణ సరిగా లేక కొన్ని ప్రాంతాల్లో గుంతలు పడ్డాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత గుంతలు పూడుస్తున్నారు. అయితే రహదారిని కొంత మేరకు విస్తరించి పటిష్టపరిచేందుకు ప్రైవేటుసంస్థలకు అప్పగించడం విమర్శలకు గురవుతోంది. కొత్తగా నిర్మించే రహదారులను ప్రైవేటు సంస్థలకు అప్పగించవచ్చునని సగం రోడ్డు ఇప్పటికే ఉండగా సగం రోడ్డు అనుసంధానం చేసి ప్రజల నుంచి టోల్ ఫీజులు వసూలు చేయాలన్న నిర్ణయంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో దాదాపు 720 కిలో మీటర్ల మేరకు రహదారులను మరమ్మత్తులు చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు 100 కిలో మీటర్ల మేరకు గుంతలుపూడ్చి తాత్కాలిక మరమ్మతులు చేశారు. కొన్ని ప్రాంతాల్లో దాదాపు 70 కిలో మీటర్ల వరకు పూర్తిగా దెబ్బతిన్న రోడ్లను గుర్తించారు. వీటిని పూర్తిగా నిర్మించాల్సిన అవసరాన్ని గుర్తించారు.



మాట్లాడుతున్న పాశం రామారావు

విద్యుత్ భారాలు వేయొద్దు

రౌండ్‌టేబుల్ సమావేశంలో వామపక్ష పార్టీల డిమాండ్

ప్రజాశక్తి-గుంటూరు

సర్దుబాటు ఛార్జీల పేరుతో విద్యుత్ ఛార్జీల పెంపును, స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. విద్యుత్ ఛార్జీల పెంపుదలపై సోమవారం బ్రాడీపేటలోని సిపిఎం కార్యాలయంలో సిపిఎం, సిపిఐ, సిపిఐ (ఎంఎల్), న్యూడెమెక్రసీ, ప్రజాపోరు తదితర పార్టీల ఆధ్వర్యంలో సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని ప్రజలకు వాగ్దానం చేసి, అధికారంలోకి వచ్చిన 5 నెలల్లోనే భారాలు మోపిందన్నారు. గత వైసిపి ప్రభుత్వం ఐదేళ్లలో రూ.32 వేల కోట్లు విద్యుత్ భారాలు మోపగా, టిడిపి ప్రభుత్వం ఐదు నెలల్లోనే రూ.17,898 కోట్ల భారాలు మోపుతోందన్నారు. 2022-23, 2023-24 సంవత్సరాల్లో వాడుకున్న కరెంటుకు ఇప్పుడు సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రజల నుండి వసూలు చేయటం అన్యాయమన్నారు. 15 నెలల పాటు యూనిట్‌కు రూ.1.27 చొప్పున రూ.6072 కోట్లు ఇప్పటికే భారాలు వేశారని, మరో రూ.11 వేల కోట్ల భారాలు వేయాలని విద్యుత్ శాఖ ప్రజల అభిప్రాయాల కోసం చర్చకు పెట్టిందని చెప్పారు. విద్యుత్ కొనగోళ్ల అమ్మకాలలో తేడాలు వస్తే ఆ ▶ 2లో

స్మార్ట్ మీటర్ బిగింపును అడ్డుకున్న షాపు యజమాని, సిపిఎం

4లో



తాడేపల్లిలో రైతులతో మాట్లాడుతున్న నాయకులు

కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా

నేడు రైతు, కార్మిక సంఘాల ర్యాలీ, సభ

ప్రజాశక్తి-తాడేపల్లి

సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో గుంటూరులో మంగళవారం రైతు, కార్మిక సంఘాలు నిర్వహించే ర్యాలీని జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకర్‌రావు కోరారు. ఈ మేరకు స్థానిక నెహ్రూ బొమ్మ సెంటర్లో రైతులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఢిల్లీ రైతు ఉద్యమం సందర్భంగా ప్రధాని ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. పంటకు మద్దతు ధర చట్టం తేవాలని, విద్యుత్ సంస్కరణలను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. పంటల బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే భరించాలన్నారు. రైతులకు రెండు లక్షల వరకు రుణమాఫీ చేయాలని కోరారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ఉపాధి హామీ పనులను ఏడాదిలో 200 రోజులు కల్పించి కూలి రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, రుణాలు ఇవ్వాలన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీతో పాటు ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మడం నిలిపివేయాలని డిమాండ్ ▶ 2లో

మహిళా మీకోసం వాహనాలు ప్రారంభం

- దృష్టి కోణం మార్పుతో అనేక సమస్యల పరిష్కారం
- కుటుంబ సభ్యుల మాదిరిగానే మహిళలందర్నీ చూడాలి : కలెక్టర్

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

కుటుంబ సభ్యులను చూసినట్టే సమాజంలోని ఇతర మహిళలనూ చూడగలిగితే మహిళలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు సునాయసనంగా పరిష్కారమవుతాయని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అన్నారు. గుంటూరులోని పోలీస్ పరేడ్ మైదానంలో సోమవారం సాయంత్రం 'మహిళా మీకోసం' పేరుతో 'మీ సంరక్షణ మా సంకల్పం' అనే నినాదంతో ఏర్పాటు చేసిన వాహనాలను కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. మహిళలు స్వేచ్ఛగా రాత్రి వేళ కూడా ప్రయాణించే పరిస్థితి రావాలన్నారు. రాత్రి వేళ ప్రయాణించే మహిళలకు భరోసా కల్పించేందుకు పోలీసుశాఖ తగిన చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలు ధైర్యంగా ఉద్యోగ, ఉపాధి రంగాల్లో రాణిస్తేనే ఆర్థిక స్వాతంత్ర్యం వస్తుందన్నారు. ఎస్‌పి సతీష్‌కుమార్ మాట్లాడుతూ మహిళల సంరక్షణ ప్రధాన ధ్యేయంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని, రాత్రి సమయంలో ప్రయాణించే మహిళలు ఏవైనా ఇబ్బందులకు గురైతే ఆ సమయంలో వారికి ప్రయాణ సౌకర్యాన్ని కల్పించి వారి గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుస్తామని ▶ 2లో



వాహనాలను ప్రారంభిస్తున్న గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి



తేమ 15 శాతం ఉన్నా పత్తి కొనుగోలు

సిసిఐ కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే పుల్లారావు

ప్రజాశక్తి - యడ్లపాడు

పత్తిలో తేమ 15 శాతం వరకూ ఉన్నా కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వం అనుమతించిందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. మండలంలోని తిమ్మాపురం తిఉమల కాటన్ మిల్లులో సిసిఐ కేంద్రాన్ని సోమవారం పరిశీలించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ పత్తిరైతుల ఇబ్బందులపై తాను అసెంబ్లీలో మాట్లాడానని, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడరని చెప్పారు. రాష్ట్ర వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు కూడా సిఎం చంద్రబాబు ద్వారా కేంద్ర జౌళి శాఖ మంత్రికి లేఖ రాశారని తెలిపారు. ఈ నేపథ్యంలోనే తేమ శాతంలో సడలింపు వచ్చిందన్నారు. ఇప్పటికే పత్తి మిల్లులు తెబ్బతిన్నాయని, సరైన ధరలు దక్కకపోతే రైతులు కూడా నష్టాలు తట్టుకోలేక పంటలేయడం మానేస్తారని అన్నారు. ఈ విషయాన్ని గమనించి షరతులేమీ లేకుండా పంటను కొనాలని సిసిఐ అధికారులను కోరారు.



అంతర్జాతీయ స్థాయిలో జగన్ అవినీతి

టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు కొమ్మలపాటి శ్రీధర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : అవినీతిలో మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి ఖ్యాతి అంతర్జాతీయ స్థాయికి చేరిందని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ విమర్శించారు. నరసరావుపేటలోని టిడిపి జిల్లా కార్యలయంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ విద్యుత్ ఒప్పందాల్లో రూ.1750 కోట్ల లంచాలను సెకి నుంచి జగన్ తీసుకున్న విషయాన్ని ఎఫ్‌బిఐతో పాటు అమెరికా దర్యాప్తు సంస్థలు తేల్చాయన్నారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలు ఫణంగా పెట్టిన జగన్ తన అవినీతి సామ్రాజ్యాన్ని ఎలా నిర్మించుకున్నారో బట్టబయలైందన్నారు. బహిరంగ మార్కెట్లో రూ.2 లోపే యూనిట్ విద్యుత్ అందుబాటులో ఉన్నా రూ.2.49కు కొనుగోలు చేసి వినియోగదారులపై రూ.కోట్ల భారం మోపడానికి యత్నించారన్నారు. ఈ విద్యుత్ ఒప్పందాల వెనుక రూ.లక్షకోట్ల కుంభకోణం ఉన్నట్లు టిడిపి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చెప్పిందని అన్నారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రూ.8 లక్షల కోట్ల అవినీతికి పాల్పడి రాష్ట్రాన్ని 20 ఏళ్ల వెనక్కి నెట్టారని విమర్శించారు. సమావేశంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కిరణ్, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షులు సిహెచ్.ఆంజనేయులు పాల్గొన్నారు.

వాయిదాలు, వడ్డీలకే రూ.70 వేల కోట్లు : జీవీ

ప్రజాశక్తి - వినుకొండ : ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.3,480 కోట్లు చెల్లించకుండా ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై జగన్ నిందలేస్తున్నారని వినుకొండ ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు విమర్శించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన జారీ చేశారు. పాఠశాలల్లో మౌలిక వసతులకు సంబంధించి రూ.వెయ్యి కోట్లు, చిన్నారుల చిక్కీలు, కోడిగుడ్లకు రూ.178 కోట్లు, పిల్లలకు కుట్టుకూలికి రూ.65 కోట్లను జగన్ సిఎంగా ఉండగా బకాయి పెట్టారని పేర్కొన్నారు. అమ్మఒడి ఆగిపోయిందంటూ తప్పుడు ప్రచారం చేయాలని చూస్తున్నారని, ఇటీవలే బడ్జెట్‌లో తల్లికివందనం పథకానికి రూ.6,487 కోట్లు కేటాయించామని తెలిపారు. రాష్ట్రాన్ని రూ.10 లక్షల కోట్లు పైగా అప్పుల్లో పెట్టి పోయిన జగన్ నిర్వాకాలకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అసలు, వడ్డీల రూపంలో రూ.53,253.30 కోట్లు చెల్లించాల్సి వస్తోందని, కార్పొరేషన్ల పేరిట చేసిన అప్పులు దీనికి అదనమనిని, వాటి వాయిదాలు, వడ్డీలు కూడా కలిపితే ఏడాదికి రూ.70 వేల కోట్లకు పైగా భారం పడుతోందని పేర్కొన్నారు.

ఫార్మసీ కళాశాలలో జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఎఎన్‌యు : ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో యూజీసీ సౌజన్యంతో వచ్చేనెల 11, 12 తేదీల్లో రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు సదస్సు డైరెక్టర్ డాక్టర్ డి.రవిశంకర్‌రెడ్డి తెలిపారు. ఔషధాలు ఆవిష్కరణ అభివద్ధిలో బహుళ విభాగ పరిశోధన అనే అంశంపై సదస్సు ఉంటుందన్నారు. ఈ మేరకు బ్రోచర్‌ను విసి కె.గంగాధరరావు, రెక్టార్ కె.రత్నషీలామణి, రిజిస్ట్రార్ జి.సింహాచలం, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.ప్రమీలారాణి సోమవారం ఆవిష్కరించారు. సదస్సు డైరెక్టర్ మాట్లాడుతూ సదస్సుకు ముఖ్య ప్రసంగీకులుగా ప్రొఫెసర్ కెఆర్ఎస్.సాంబశివరావు హాజరవుతారని, మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఐ.బాలకృష్ణ, కేరళలోని త్రివేండ్రం రీజినల్ క్యాన్సర్ రీసెర్చ్ సెంటర్ నుంచి డాక్టర్ బి.చంద్రశేఖరన్, బెంగళూరులోని ఆల్ అమీన్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎమ్‌డి సల్లా హుద్దీన్, హైదరాబాద్‌లోని నల్ల నరసింహారెడ్డి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ డీన్ డాక్టర్ సిహెచ్.కృష్ణమోహన్ హాజరవుతారని తెలిపారు. మేడికొండూరులోని కెసిరెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాసుటికల్ సైన్సెస్ కో-స్పాన్సర్‌గా సదస్సు జరుగుతుందన్నారు. సదస్సుకు కన్వీనర్‌గా డాక్టర్ అన్నపూర్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా డాక్టర్ కె.సుజనా, కోశాధికారిగా డాక్టర్ కెఇ.ప్రవల్లిక, జాయింట్ ఆర్గనైజేషన్ సెక్రటరీగా డాక్టర్ షేక్.మస్తానమ్మ, కె.విజయ్ కిషోర్ వ్యవహరిస్తారని చెప్పారు. బ్రోచర్ ఆవిష్కరణలో డాక్టర్ పి.రవి, డాక్టర్ ఎం.గాయత్రి రమ్య, ఎంఎఎం ఫార్మసీ కళాశాల ఛైర్మన్ ఎం.శేషగిరిరావు పాల్గొన్నారు.

పల్నాడు ఎస్పీ గ్రీవెన్స్‌కు 50 ఫిర్యాదులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

స్పందనకు వచ్చిన ప్రతి ఫిర్యాదులకు సకాలంలో పరిష్కారం చూపాలని, తద్వారా ప్రజలకు విశ్వాసం పెంపొందేలా సిబ్బంది వ్యవహరించాలని పోలీసు సిబ్బందిని పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆదేశించారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్రజల నుండి 50 ఫిర్యాదులు స్వీకరించారు. ఇందులో కుటుంబ, ఆస్తి, ఇతర వివాదాలకు సంబంధించినవి ఉన్నాయి.

స్థలాన్ని కబ్జా చేశారు

మాచర్ల పట్టణం నెహ్రూ నగర్‌లో 1970లో తన తల్లిదండ్రులు కొనుగోలు చేసిన 13 సెంట్ల స్థలం తనకు వారసత్వంగా వచ్చిందని, దీన్ని కబ్జా చేయడంతోపాటు స్థలం చుట్టూ ఉన్న ప్రహరీ గేటును ధ్వంసం చేశారని నరసరావుపేట పట్టణానికి చెందిన మేకల సత్యవతి ఫిర్యాదు చేశారు. తెనాలికి చెందిన నళిని, మాచర్లకు చెందిన డాక్యుమెంట్ రైటర్ హనుమంతరావు అతని అనుచరులు దానం బాబు, బాలాజీ, సుబ్రహ్మణ్యం తదితరులపై చర్యలు తీసుకోవాలని మాచర్ల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదని చెప్పారు. స్థలం విషయంలో జోక్యం చేసుకుంటే చంపేస్తామని బెదిరిస్తున్నారని వాపోయారు.

నా ప్రమేయం లేని అప్పు తీర్చాలని వేధింపులు

జాబ్ కన్సల్టెన్సీ నడుపుతున్న నెల్లూరుకు చెందిన వేదవతితో గుంటూరుకు చెందిన స్నేహితుడు భాస్కర్‌రెడ్డిని ఉద్యోగం కోసం పరిచయం చేశానని, అయితే వేదవతి వద్ద భాస్కర్‌రెడ్డి రూ.5 లక్షల అప్పు చేయగా ఆ డబ్బును తీర్చాలంటూ తనపై వేదవతి వేధింపులకు పాల్పడుతున్నారని రొంపిచర్ల మండలం మాచవరానికి చెందిన అలికేపల్లి రవీంద్రరెడ్డి ఫిర్యాదు చేశారు.

స్థలం డబ్బు తీసుకొని రిజిస్ట్రేషన్ చేయడం లేదు

నరసరావుపేట మండలం తురకపాలెం వద్ద 3 సెంట్ల స్థలాన్ని రూ.5 లక్షలకు కొనుగోలు చేశానని రెండేళ్లు గడుస్తున్నా రిజిస్ట్రేషన్ చేయకుండా తురకపాలేనికి చెందిన ఖాజాబాబు ఇబ్బందులు పెడుతున్నారని రావిపాడుకు చెందిన గంధం సాంబయ్య ఫిర్యాదు చేశారు. దీనిపై రూరల్ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేయగా డబ్బులు ఇస్తామని ఒప్పందం కుదిరిందని, ఒప్పందం సమయం ముగుస్తున్నా డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని చెప్పారు.

హాస్టల్ ఫీజు వెనక్కు ఇవ్వడం లేదు

కుమారుడు వరుణ్ తేజ్ బీటెక్ చదివేందుకు చెన్నైలోని డాక్టర్ ఎం.జి.ఆర్ కళాశాల ఫీజులు చెల్లించానని, అదే కళాశాలకు అనుబంధంగా ఉన్న హాస్టల్‌కు రూ.55 వేలు చెల్లించి కుమారుడిని వదిలి రాగా అక్కడి వాతావరణం గిట్టక కుమారుడు రెండ్రోజులకే అస్వస్థతకు గురైన నేపథ్యంలో సీటు వద్దని కళాశాలను సంప్రదించగా కళాశాల ఫీజు వెనక్కు ఇచ్చారని, హాస్టల్ ఫీజు 10 రోజులలో ఇస్తామని రాత పూర్వకంగా హామీ ఇచ్చి 5 నెలలు గడుస్తున్నా డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని నరసరావుపేటకు చెందిన వీడియో గ్రాఫర్ గడ్డం శివశంకర్ ఫిర్యాదు చేశారు.

కోడలి నుండి ప్రాణ హాని..

ఆరేళ్ల క్రితం మాచవరం మండలం చెన్నాయిపాలేనికి చెందిన శ్రావణిని కుమారుడు సుధీర్‌కు వివాహం జరిపించామని, కుటుంబ కలహాలు నేపథ్యంలో 4 నెలలకు విడిపోయారని, కొద్ది రోజులకే కుమారుడు సుధీర్ అదృశ్యమయ్యాడని మాచర్లకు చెందిన మేడి యాకోబు ఫిర్యాదు చేశారు. కొన్నేళ్ల నుండి కోడలు శ్రావణి ఆస్తిలో వాటా కావాలని కట్నంగా ఇచ్చిన రూ.2 లక్షలకు బదులు రూ.5 లక్షలు ఇవ్వాలని బెదిరింపులకు పాల్పడుతున్నట్లు చెప్పారు. తమకు వివాహం కావాల్సిన కుమార్తె ఉందని, ఉన్న కొద్దిపాటి ఉమ్మడి ఆస్తిని అమ్మినపుడు కొంత నగదు ఇస్తామని చెబుతున్నా వినుకుండా బెదిరిస్తున్నట్లు చెప్పారు.



అంగన్వాడీలపై దాడులు, వేధింపులు

అంగన్వాడీలపై దాడులపై విచారణ జరిపి రక్షణ కల్పించాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ - హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) కోరింది. ఈ మేరకు యూనియర్ పల్నాడు అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు కెపి మెటిల్డాదేవి, జి.మల్లీశ్వరి, సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయలు నాయక్ ఎస్పి కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లపై దాడులు జరుగుతున్నాయని, ఉద్యోగాలకు బలవంతంగా రాజీనామాలు చేయిస్తున్నారని అన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 15 మందితో రాజీనామాలు చేయించారని, రాజీనామా చేయని వారిపై భౌతికంగా దాడులకు పాల్పడుతున్నారని వివరించారు. విధి నిర్వహణలో ఉండగా ఆయా గ్రామాల్లో ఉన్న అధికార పార్టీ నాయకులు కొంతమంది మహిళలను రెచ్చగొట్టి వర్కర్లపై భౌతికంగా దాడులు చేయిస్తున్నారన్నారు. అప్పటికీ రాజీనామాలు చేయకపోతే కుటుంబ సభ్యులపైనా దాడులకు పాల్పడుతున్నారన్నారు. వీటిపై విచారణ జరపాలని, దాడులు జరగకుండా రక్షణ కల్పించాలని కోరారు.

బాల్య వివాహాలు, లింగ వివక్షపై ర్యాలీలు

ప్రజాశక్తి - తాడికొండ: బాల్య వివాహాలు సాంఘిక దురాచారమని తహశీల్దార్ నాసరయ్య అన్నారు. రావెల గ్రామంలో చైల్డ్ రైట్స్ అడ్వొకేసీ ఫౌండేషన్ - క్రాఫ్ ఆధ్వర్యంలో బాల్య వివాహ అనర్థాలు - చర్యలపై సోమవారం ప్రచారం చేశారు. తహశీల్దార్ మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, రెండేళ్ల జైలు, జరిమానా విధిస్తారని చెప్పారు. బాల్య వివాహాలు బాలికల విద్యా, రక్షణ, ఆరోగ్యం, అభివృద్ధికి ఆటంకమే కాకుండా వారి కలలను సహకారం చేసుకునే అవకాశాలను దూరం చేస్తుందని చెప్పారు. ఎంపిడిఒ సమతావాణి మాట్లాడుతూ బాలికలు అనేక రకాల వివక్షలకు గురవుతున్నారని, వాటిని అరికట్టవలసిన బాధ్యత అందరిపైనా ఉందని చెప్పారు. అమ్మాయిలైతే 18 ఏళ్లలోపు, అబ్బాయిలైతే 21 ఏళ్లలోపు పెళ్లిళ్లు చేయొద్దన్నారు. ఎవరైనా బాల్య వివాహం చేయాలని చూస్తే వెంటనే గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శికి, గ్రామ సెక్రెటరీకి సమాచారం ఇవ్వాలని కోరారు. చైల్డ్ హెల్ప్ లైన్ 1098, పోలీస్ హెల్ప్ లైన్ 100, టోల్ ఫ్రీ 112 తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆర్.శైలజ, ఎంఇఒ టి.ఇందిర, ఆర్.సాంబశివరావు క్రాఫ్ జిల్లా కో-ఆర్డినేటర్ జి.వెంకట్, జయరాజు, బ్యూలా పాల్గొన్నారు.



ప్రజాశక్తి - దుగ్గిరాల : నారీ చేతన్ 3.0 దేశవ్యాప్తంగా జరుగుతున్న కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద సోమవారం ప్రతిజ్ఞ అనంతరం ర్యాలీ చేశారు. తహశీల్దార్ ఐ.సునీత మాట్లాడుతూ పురుషులతో సమానంగా మహిళలు కూడా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, వారి పట్ల చిన్నచూపు తగదని అన్నారు. ఎంపిడిఒ ఇ.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆడపిల్లల పట్ల వివక్ష తగదన్నారు. ఎంపిఎం ఎ.సురేష్ మాట్లాడుతూ పురుషులతో సమానంగా స్త్రీలు గౌరవించబడితేనే ఆ దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని చెప్పారు.



ప్రజాశక్తి - మేడికొండూరు : లింగ ఆధారిత హింస వివక్షకు వ్యతిరేకంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. ఎంపిడిఒ టి.చందన, ఎపిఎం విజయభారతి ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. ఇఒపిఆర్‌డి పూర్ణ శంకరరావు, ఏపీవో కిరణ్మయి, ఎంఇఒ జి.ఏసురత్నం, ఐసిడిసిఎస్ సూపర్వైజర్ కృష్ణకుమారి, హేమలత, డ్వాక్రా సంఘాల సీసీలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

విద్యుత్ భారాలు వేయొద్దు

(మొదటి పేజీ తరువాయి)

సమస్యను పరిష్కరించాల్సింది ఆయా ప్రభుత్వాలు తప్ప, ప్రజలపై భారాలు మోపడం ఏమిటని ప్రశ్నించారు. విద్యుత్ ఉత్పత్తి పంపిణీ రాష్ట్రాల పరిధిలోని అంశమని, కానీ కేంద్రంలో మోడీ ప్రభుత్వం విద్యుత్ చట్ట సవరణ ద్వారా రాష్ట్రాల హక్కులను హరిస్తోందని విమర్శించారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సవరణ బిల్లులు తెచ్చి ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలకు విద్యుత్ ఉత్పత్తి చేసే హక్కును కల్పిస్తుందన్నారు. మరోవైపు అదాని కంపెనీతో కుదుర్చుకున్న ఒప్పందాల మేరకు స్మార్ట్ మీటర్లు బిగించి, వినియోగదారుల నుండి ముందస్తు చెల్లింపులకు శ్రీకారం చుట్టిందన్నారు. ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలకు, వ్యాపార సంస్థలకు స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని, క్రమేణా ఇళ్ళకు కూడా బిగిస్తారని అన్నారు. విద్యుత్ చట్ట సవరణ వల్ల వివిధ అణగారిన వర్గాలకు ఇచ్చే ఉచిత విద్యుత్ ప్రమాదంలో పడబోతుందన్నారు. మరోవైపు సౌరవిద్యుత్ అమ్మకాల్లో అదాని కంపెనీలు, అధికారులకు ప్రజా ప్రతినిధులకు రూ.వేలకోట్ల లంచాలిచ్చినట్లు అమెరికా కోర్టులో కేసు వేసిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి అదానీని అరెస్టు చేయించాలని, అదాని కంపెనీతో కుదుర్చుకున్న వ్యాపార ఒప్పందాలను రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశార. విద్యుత్ భారాలను ప్రజలు ప్రతిఘటించాలన్నారు. భారాలపై దశల వారీగా ఆందోళనకు పూనుకుంటామని నాయకులు స్పష్టం చేశారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, సిపిఐ (ఎంఎల్) నాయకులు యు.నాగేశ్వరరావు, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు వి.నరసింహారావు, ప్రజాపోరు నాయకులు కోటేశ్వరరావు, వివిధ ప్రజాసంఘాల నాయకులు వై.నేతాజి, అరుణ్, ఇ.అప్పారావు, ఎమ్.ఎ.చిస్టీ, కె.అజయ్‌కుమార్, బి.శ్రీనివాసరావు, ఎల్.అరుణ, వై.కృష్ణకాంత్, ముసలయ్య, సమీర్, శశీ, కె.నళినీకాంత్, ఎన్.భావన్నారాయణ పాల్గొన్నారు.

'మహిళా మీకోసం' వాహనాలు ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. విద్యాసంస్థల వద్ద విద్యార్థులను ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్ బారిన పడకుండా కాపాడటానికి, వారంలో ఒకరోజు విద్యాసంస్థల్లోనే విద్యార్థినుల భద్రత గురించి తెలుసుకోవడానికి ఈ కార్యక్రమం రూపొందించామన్నారు. మహిళలు ఎవరైనా ఆపదలో ఉన్నప్పుడు 97464 14641 ఫోన్ నంబర్‌కు సంప్రదిస్తే పోలీసు సహాయాన్ని పొందవచ్చని తెలిపారు. అనంతరం గుంటూరు మున్సిపల్ కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడారు. ఈ సందర్భంగా శాంతి కపోతాలను, రంగు రంగుల బెలూన్లను వైపు ఎగురవేసి సభకు హాజరైన మహిళలు సంతోషాన్ని ప్రకటించగా వివిధ రంగాల్లో తమ ప్రతిభ పాటవాలను ప్రదర్శించిన పలువురు మహిళలను సన్మానించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు చేసిన విద్యార్థినీ విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందించారు.

నేడు రైతు, కార్మిక సంఘాల ర్యాలీ, సభ

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. కార్యక్రమంలో నాయకులు డి.వెంకట్‌రెడ్డి, బి.వెంకటేశ్వర్లు, డివి భాస్కర్‌రెడ్డి, వై.బర్నబాస్, జి.శ్రీనివాసరావు, డి.బుల్లి కోటిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తాడికొండ

కేంద్ర ప్రభుత్వం ఆవలంబిస్తున్న కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ నేడు గుంటూరులో జరిగే ర్యాలీ, బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘ జిల్లా కార్యదర్శి పచ్చల శివాజీ కోరారు. ఈ మేరకు తాడికొండలో కరపత్రాలను పంపిణీ చేశారు. నాయకులు సిహెచ్.భాస్కరరావు, కె.అనిల్ కుమార్, కె.పూర్ణయ్య, ఆర్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెడదాం

న్యాయ శాస్త్ర నిపుణులు ప్రొఫెసర్ ఎన్.రంగయ్య

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి : ప్రపంచంలో అతిపెద్ద లిఖిత రాజ్యాంగంగా పేరుగాంచిన భారత రాజ్యాంగ స్ఫూర్తిని, నైతికతను నిలబెట్టాల్సిన అవశ్యకత ప్రధాన రాజకీయ పార్టీలు, మేధావులు, కోట్లాది ప్రజలపై ఉందని న్యాయ శాస్త్ర నిపుణులు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పూర్వ రిజిస్టార్ ప్రొఫెసర్ ఎన్. రంగయ్య పేర్కొన్నారు. గుంటూరులోని జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా 'రాజ్యాంగాన్ని కాపాడుకుందాం' అనే అంశంపై సోమవారం జరిగిన చర్చా గోష్టిలో రంగయ్య ప్రసంగించారు. భారత రాజ్యాంగ డ్రాఫ్టింగ్ కమిటీ ఛైర్మన్ గాను, మరో నాలుగు కమిటీలలో సభ్యునిగా కృషిచేసి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భారత రాజ్యాంగ నిర్మాతగా దేశ ప్రజల అభిమానాన్ని చూరగొన్నారని తెలిపారు. భారత రాజ్యాంగ మౌళిక స్వరూపానికి భిన్నంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరించిన సందర్భాలలో సుప్రీంకోర్టు, హైకోర్టు జోక్యం చేసుకోవడాన్ని సమర్థించారు. రాజ్యాంగ ఆదేశిక సూత్రాలలో పొందుపరిచిన ప్రజల మధ్య ఆర్థిక అసమానతలు తగ్గించడానికి బదులు గత 75 సంవత్సరాలలో ఆర్థిక అసమానతలు పెరిగాయని, దేశ ప్రజలలో ఒక్క శాతం మంది వద్ద 50 శాతం సంపద కేంద్రీకతమైందని ఆవేదన వ్యక్తం చేశారు. శాసనమండలి సభ్యులు కె. యస్. లక్ష్మణరావు ప్రసంగిస్తూ సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జీలకు పదవీ విరమణ కాగానే రాజకీయ పదవులు కడబెట్టే సాంప్రదాయం మంచిది కాదని, ఇది న్యాయవ్యవస్థ పై నమ్మకం సన్నగిల్లెలా చేస్తుంద న్నారు. కొలీజియం పద్ధతిలో జడ్జీల నియమకాన్ని సమీక్షించుకోవాలని, జమిలీ ఎన్నికలు సమైక్య స్ఫూర్తిని దెబ్బతీస్తుందని తెలిపారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ ప్రసంగిస్తూ వయోజనులందరికీ ఓటు హక్కు కల్పించటం, దళిత, గిరిజన, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరచడం అభినందనీయమన్నారు. రాజ్యాంగ నైతికతను పాటిస్తూ రాజకీయవేత్తలు, అధికార యంత్రాంగం, న్యాయాధికారులు రోల్ మోడల్ గా ఉంటేనే భారతదేశం వికసించగలదన్నారు. సభకు జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. నేస్తం సహాయ వ్యవస్థాపకులు టి.ధనుంజయ రెడ్డి, జనచైతన్య వేదిక రాష్ట్ర కార్యదర్శి పి. శేషుబాబు, రాజ్యాంగ చర్చా వేదిక కన్వీనర్ అవధానుల హరి, మానవత డైరెక్టర్ చావ శివాజీ, సామాజిక వేత్త బత్తుల కోటేశ్వరరావు ప్రసంగించారు.



ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ రంగయ్య, వేదికపైన ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, డొక్కా, లక్ష్మణరెడ్డి

రాజ్యాంగంపై గౌరవ భావం కలిగి ఉండాలి : డిఇఒ

ప్రజాశక్తి-గుంటూరు

భారత రాజ్యాంగం మహిళలకు సమాన హక్కులు కల్పించటం వల్ల మహిళలు అన్ని రంగాల్లో ముందు ఉన్నారని జిల్లా విద్యాశాఖ అధికారి సి.వి.రేణుక అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని పాతగుంటూరు పరీక్ష భవన్‌లో విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలు నిర్వహిం చారు. గెలుపొందిన వారికి బహుమ తులు అందజేశారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ భారత రాజ్యాంగం 75 సంవత్సరాలు పూర్తి చేసుకోవటం ఎంతో గర్వంగా ఉందన్నారు. పౌరులు అందరూ రాజ్యాంగం పట్ల గౌరవం కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరికీ జీవించే హక్కు, స్వేచ్ఛా మన రాజ్యాంగం కల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు ఉప విద్యాశాఖ అధికారి పి.వెంకటేశ్వరరావు, డిసిఇబి సెక్రెటరీ ఎ.తిరుమలేష్, ఉర్దూ డిఐ ఖాసిం, ఎంఇఒలు జ్యోతికిరణ్, నాగేంద్రమ్మ, అబ్దుల్ ఖుద్దూస్ తదితరులు పాల్గొన్నారు.




టిజెపిఎస్ విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసిన నగర కమిషనర్

స్వచ్ఛ భారత్‌లో ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల పాత్ర కీలకం

ప్రజాశక్తి-గుంటూరు

స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో సామాజిక సేవా భావం కలిగిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు కీలక పాత్ర వహించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు గుంటూరులో వివిధ ప్రదేశాలలో చేపట్టిన స్వచ్ఛత హి సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్న టిజెపిఎస్ కాలేజి ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు నగర కమిషనర్ సోమవారం ప్రశంసా పత్రాలు అందజేశారు. అలాగే వాలంటీర్లకు కళాశాల సెక్రటరీ, కరెస్పాండంట్ కె.వి.బ్రహ్మం, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ వి. దివ్య తేజోమూర్తి గారు అభినందించారు.కార్యక్రమంలో గుంటూరు జిల్లా జాతీయ సేవా పథకం కార్యక్రమం నిర్వహణ అధికారి డాక్టర్ జె. వి. సుధీర్ కుమార్, కె. నారాయణ పాల్గొన్నారు.

వైసిపి నాయకులకు బిగుస్తున్న ఉచ్చు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుటుంబ సభ్యులపై 2020లో సోషల్ మీడియా ద్వారా వైసిపి నాయకులు పెట్టిన అసభ్యకరమైన పోస్టింగ్‌లపై విచారణ వేగం పుంజుకుంది. అప్పట్లో నరేంద్ర భార్య జ్యోతిర్మయి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు అప్పట్లో చర్యలు తీసుకోలేదు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ కేసు దర్యాప్తు తిరిగి ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ప్రధాన నిందితుడు షేక్ గోపిలాల్‌ను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కిలారు రోశయ్య తోపాటు పలువురు వైసిపి నాయకుల ప్రోద్బలంతోనే తాను పోస్టింగ్‌లు పెట్టినట్టు తెలిపారు. దీంతో వీరిందరిని అదుపులోకి తీసుకుని విచారించాలని నిర్ణయించారు. గోపిలాల్ ఇటీవల విచారణ లోని వైసిపికి చెందిన కీలక నేతల ప్రమేయంతోనే తాను పోస్టింగ్స్‌ను పెట్టినట్టు వెల్లడించడంతో వారిని అరెస్టు చేస్తారని పొన్నూరులో ప్రచారం జరుగుతుంది. దీంతో పలువురు నేతలు అజ్ఞాతంలో వెళ్లిపోయారు. ఈ కేసులో తప్పించుకు తిరుగుతున్న వైసిపి నాయకులపై ప్రస్తుతం పొన్నూరు రూరల్ పోలీసులు పట్టు బిగిస్తుండడంతో వైసిపి నాయకులు బెంబేలెత్తుతున్నారు.



మంత్రిగారూ మీ పిలుపు కోసం ఎదురు చూస్తున్నాం ..

29వ రోజుకు చేరిన సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి-తాడేపల్లి

రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి, మంగళగిరి ఎమ్మెల్యే నారాలోకేష్ కోసం తాము ఎదురు చూస్తున్నామని, ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చెప్పారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం కార్మికులు చేస్తున్న దీక్షలు సోమవారం నాటికి 29వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు మాట్లాడుతూ కోర్టు తీర్పులు కార్మికులకు అనుకూలంగా ఇచ్చిన యాజమాన్యం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు, యాజమాన్యానికి మధ్యవర్తిగా మంత్రి నారా లోకేష్ చర్చలకు ఆహ్వానించి సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కొరపాటి స్టీవెన్, ఏ ఐ ఎఫ్ టి యు నాయకులు కే ఆదినారాయణ, బి యెహోషువ, ఎం ఆశీర్వాదం, సాంబయ్య, దుర్గ భవాని, నాగేశ్వరరావు, సుబ్బారావు, ఇస్రాయిల్, జానీ, గురవయ్య, సుభాని, రమణ, కృష్ణ, శారద, శారమ్మ, నవనీతం, ఇమాంబి పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ బిగింపును అడ్డుకున్న షాపు యజమాని, సిపిఎం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

సత్తెనపల్లి పట్టణంలో వారం రోజుల నుండి ఆదాని కంపెనీ సిబ్బంది విద్యుత్ స్మార్ట్ మీటర్లను చాపకింద నీరుల బిగించడం ప్రారంభించారు. ఇప్పటికీ 500కు పైగా స్మార్ట్ మీటర్లు బిగించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం స్థానిక ఎన్టీఆర్ కాంప్లెక్స్‌లో స్మార్ట్ మీటర్లు బిగిస్తుండగా వస్త్రదుకాణ యజమాని అవ్వారు సర్వేశ్వరరావు అభ్యంతరం తెలపడంతోపాటు సమాచారాన్ని సిపిఎం నాయకులు అందించారు. దీంతో సిపిఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు గద్దె చలమయ్య, పట్టణ కార్యదర్శి డి.విమల, ఇతర కార్యకర్తలు హుటాహుటిన అక్కడకు చేరుకోగా అదానీ కంపెనీ సిబ్బంది అక్కడి నుండి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా గద్దె చలమయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు బిగిస్తుంటే వద్దని చెప్పిన టిడిపి ఇప్పుడు ఏకంగా రూ.18 వేల కోట్ల విద్యుత్ ఛార్జీలు పెంచి ఆ పెంచిన బిల్లుల మొత్తాన్ని వసూలు చేసేందుకు స్మార్ట్ మీటర్ల బిగించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. స్మార్ట్ మీటర్లు బిగించే కాంట్రాక్టు అదాని కంపెనికి



స్మార్ట్ మీటర్‌ను బిగించేందుకు వచ్చిన అదాని కంపెనీ సిబ్బందితో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

అప్పగించారని, గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం సైతం అదానికి లాభాలు కట్టబెడుతున్నవేనని మండిపడ్డారు. గత సిఎం జగన్, ప్రస్తుత సిఎం చంద్రబాబు ఇద్దరూ అదానీ కనుసన్నలలో మెలిగే వారేనని అన్నారు. స్మార్ట్ మీటర్లు బిగించే ప్రాజెక్టు మొత్తాన్ని పూర్తి చేయడానికి, ప్రజల్లో వ్యతిరేకత రాకుండా ఉండటానికి మొదట ప్రభుత్వ కార్యాలయాల్లో బిగిస్తారని, ఆ తర్వాత కమర్షియల్ కాంప్లెక్స్‌లలో బిగిస్తారని, ఆ తర్వాత గృహ వినియోగదారుల ఇళ్లల్లో బిగిస్తారని తెలిపారు. స్మార్ట్ మీటర్లు బిగించడం మొత్తం పూర్తయిన తర్వాత ముందుగా రీఛార్జి చేయించుకున్న వారికే విద్యుత్ సరఫరా అవుతుందని, బ్యాలెన్స్ అయిపోయిన వెంటనే సరఫరా ఆగిపోతుందని చెప్పారు. ఈ ప్రక్రియ మొదలైతే ఇప్పటివరకు రూ.వందల్లో బిల్లులు కట్టిన వారు రూ.వేలల్లో రీఛార్జి చేయించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇప్పటికే గత ప్రభుత్వం వేసిన భారాలనే మోయలేక విసిగివేసారి పోయిన రాష్ట్ర ప్రజలపై ప్రస్తుతం చంద్రబాబు ప్రభుత్వం వేసిన రూ.18 వేల కోట్ల భారంతో ప్రజల పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందన్నారు. స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని తక్షణం ఆపాలని, విద్యుత్ భారాలును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం జరిగే ఉద్యమాల్లో ప్రజలంతా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పి.మహేష్, నాయకులు జె.రాజకుమార్, ఎ.వెంకటనారాయణ, ఎ.ప్రసాద్‌రావు, షేక్ సైదులు, డి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నమూనాలతో అబ్బురపరుస్తున్న విద్యార్థులు

రామకృష్ణాపురం గురుకుల పాఠశాలలో రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభం

ప్రజాశక్తి- సత్తెనపల్లి రూరల్

శాస్త్ర, సాంకేతిక విజ్ఞానాన్ని అందిపుచ్చుకుని భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి వి.ప్రసన్న వెంకటేష్ సూచించారు. ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ అంబేద్కర్ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురం సాంఘిక సంక్షేమ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలలో రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను ప్రసన్న వెంకటేష్ సోమవారం ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగిఉన్న నైపుణ్యాన్ని గుర్తించి, వారిని ప్రోత్సహిస్తే మంచి శాస్త్రవేత్తలుగా అందించిన వారవుతారని ఉపాధ్యా యులకు చెప్పారు. పేదరికానికి, మేధోశక్తికి సంబంధం లేదని, ఎంతోమంది మేధావులు గురుకుల విద్యాలయాల్లో చదివి ఐఎఎస్, ఐపిఎస్ అధికారులుగా రాణిస్తున్నారని చెప్పారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని, క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు మాట్లాడుతూ టీవీలకు,సెల్‌ఫోన్లకు బానిసలై భవిష్య త్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. తొలుత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలేశారు. అనంతరం విద్యార్థుల ప్రాజెక్టు నమూనాలను పరిశీలించి వాటిపై వివరాలు అడిగారు. రాష్ట్ర వ్యాప్తంగా 190 గురుకుల పాఠశాల నుండి 200 మంది విద్యార్థులు 80 నమూనాలను ప్రదర్శించారు. విద్యార్థులు ప్రదర్శించిన రోబోటిక్ ఈ-కారు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రైల్వే స్టేషన్లో వృద్ధులు, రోగులు, వికలాంగులు ఒక ప్లాట్‌ఫామ్ నుండి మరోక ప్లాట్‌ఫామ్‌కు వేళ్లేలా రూపొందించిన నమూనాలు ఆకట్టుకున్నాయి. రైతులకు ఉపయోగపడే నమూనాలను ప్రదర్శించారు. సంయుక్త కార్యదర్శి ఎస్.సంజీవరావు, గురుకుల విద్యాలయాల ఉమ్మడి గుంటూరు జిల్లా కో-ఆర్డినేటర్ కె.పద్మజ, డిఇఒ ఎం.చంద్రకళ, టిడిపి నాయకులు కన్నా నాగరాజు పాల్గొన్నారు.



నమూనాలను పరిశీలిస్తున్న గురుకులాల కార్యదర్శి, పల్నాడు కలెక్టర్

కలెక్టరేట్ వద్ద నేడు కార్మిక, కర్షక నిరసనలు



ప్రజాశక్తి - క్రోసూరు, అచ్చంపేట

కార్మిక, కర్షక సమస్యల పరిష్కారం కోసం, ఢిల్లీలో రైతు ఉద్యమం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం కలెక్టరేట్‌ల వద్ద మంగళవారం సంయుక్త కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో చేపట్టే నిరసనల్లో అన్ని రంగాల ప్రజలు పాల్గొనాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రమైన క్రోసూరులోని ఆమంచి విజ్ఞాన కేంద్రంలో ప్రజాసంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం సోమవారం నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రవిబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు, నిరసనలు చేపడుతున్నట్లు చెప్పారు. స్మార్ట్ మీటర్లు బిగింపును మానుకోవాలని, విద్యుత్ భారాలను ఉపసంహరించుకోవాలని, కార్మికుల హక్కులను కలరాసేలా తెచ్చిన 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అసంఘటిత కార్మికులకు పిఎఫ్, పెన్షన్ సౌకర్యాలు కల్పించి ఉద్యోగం భద్రత కల్పించాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ సంస్థలకు అప్పజెప్పే నిర్ణయాలను వెనుకకు తీసుకోవాలని, విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మడం ఆపివేయాలని, ఉద్యోగస్తులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, భవన నిర్మాణ కార్యక్రమాల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని తదితర 14 రకాల డిమాండ్ల సాధన కోసం ఉద్యమం కొనసాగుతోందన్నారు. సమావేశంలో నాయకులు టి.హనుమంతరావు, యేసయ్య, కె.గోపికృష్ణారెడ్డి, జి.మహేష్, కె.పెద్దబ్బాయి, ముస్తఫా, ఆదినారాయణ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా కలెక్టరేట్ వద్ద నిరసన జయప్రదం కోసం మండల కేంద్రమైన అచ్చంపేటలో ప్రచారం చేశారు.



ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ : నరసరావుపేటలోని గాంధీ పార్క్ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు జరిగే నిరసన ర్యాలీని జయప్రద చేయాలని కౌలురైతు సంఘం మండల కార్యదర్శి పి.మహేష్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మండలంలోని రెంటపాళ్లలో కరపత్రాల పంపిణీతో ప్రచారం చేశారు. నాయకులు మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం పంటలకు మద్దతు ధర ప్రకటించి గ్యారెంటీ చట్టం చేయాలని కోరారు. కౌలురైతులందరికీ గుర్తింపు కార్డుల జారీతోపాటు రుణాలు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు డి.తాతారావు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ముప్పాళ్ల : మండలంలోని మాదలలో రైతు సంఘం ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు జి.బాలకృష్ణ మాట్లాడారు.



పిల్లలు తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డిఇఒ చంద్రకళ

పిల్లల్ని బడిలో చేర్పించిన డిఇఒ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ : సత్తెనపల్లి పట్టణంలోని నాగన్న కుంటలో బడిబయట ఉన్న పిల్లలను పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.చంద్రకళ సోమవారం రాత్రి బండిలో చేర్పించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని డిఇఓ సందర్శించారు. పదోతరగతి విద్యార్థుల వర్క్ బుక్‌లను తనిఖీ చేశారు. మార్కులు ఎలా సాధించాలో అవగాహన కల్పించారు. ఎంఇఓ ఎ.శ్రీనివాసరావు, హెచ్‌ఎం మాధవీలత పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-ఈపూరు : ఖాళీగా ఉన్న చౌక ధరల దుకాణాల ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తహశీల్దార్ ఎ.నళిని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొండ్రముట్ల (ఎస్టీ), ఎ.ముప్పాళ్ల (ఓసీ) ఎ.ముప్పాళ (ఎస్సీ మహిళ), కొచ్చర్ల (ఎస్సీ), ఈపూరు (బిసి-డి), అగ్ని గుండాల (బీసీ-బి), ఇనిమెళ్ల (ఓసీ) రిజర్వేషన్ ప్రాతిప దికన శాశ్వత నియామకాల భర్తీ ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు వచ్చేనెల 4వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు దరఖాస్తులను నరసరావుపేట ఆర్‌డిఒ కార్యాలయంలో అందించాలని, 9వ తేదీన పరీక్ష, 11వ తేదీన మౌఖిక పరీక్ష నిర్వహించి 16వ తేదీన నియామక పత్రాలు అందజేస్తారని వివరించారు.

నాడు హామీలు.. నేడు అసత్యాలు..

ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు వ్యాఖ్యలపై సిపిఎం విమర్శ

ప్రజాశక్తి - వినుకొండ

వరికపూడిసెల ప్రాజెక్టుకు సంబంధించి నిధుల కేటాయింపుపై రాష్ట్ర ప్రభుత్వం అప్పుల్లో ఉందంటూ నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు లౌక్యంగా అసత్యాలు చెబుతున్నారని సిపిఎం పల్నాడు జిల్లా కమిటీ సభ్యులు కె.హనుమంతరెడ్డి విమర్శించారు. ఈ మేరకు స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆయన సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ పోలవరం, పులిచింతల, వెలుగోడు వంటి అనేక ప్రాజెక్టులకు నిధులు కేటాయించగా వరికపూడిసెలకు మాత్రం నిధుల్లేవా? అని ప్రశ్నించారు. అటవీశాఖ అనుమతులతో ప్రాజెక్టు పనులు చేపట్టాలంటే ఎన్ఎస్‌పికి రూ.18 కోట్లు కేటాయించకపోవడం సిగ్గుచేటన్నారు. 70 ఏళ్లుగా అన్ని రాజకీయ పార్టీలు, రైతు, ప్రజా సంఘాలు, వరికపూడిసెల ప్రాజెక్టు కమిటీ పోరాడుతూనే ఉన్నాయని గుర్తు చేశారు. ప్రాజెక్టు సాధన తన జీవితాశయమని గతంలో వైసిపి ఎంపిగా ఉన్నప్పుడూ శ్రీకృష్ణదేవరాయలుతోపాటు వినుకొండ, మాచర్ల ఎమ్మెల్యేలు చెప్పారని అన్నారు. తాజా బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టు గురించి వారు కనీసం మాట్లాడకపోవడం దురదష్టకరమన్నారు. 8 మండలాల్లోని 1.20 లక్షల ఎకరాలకు సాగునీరు, ఆయా మండలాల్లోని ప్రజలకు తాగునీరు అందించే వరికపూడిసెల ప్రాజెక్టుపై సిఎం చంద్రబాబు స్పందించాలని, మొదటి దశగా రూ.1600 కోట్లు కేటాయించాలని కోరారు.



యోగాలో జెడ్‌పి పాఠశాల విద్యార్థులకు పతకాలు

ప్రజాశక్తి - అచ్చంపేట

యోగా పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు బహుమతులు సాధించారని అచ్చంపేట జెడ్‌పి పాఠశాల హెచ్‌ఎం సిహెచ్ కళ్యాణి సోమవారం తెలిపారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని ఎన్ఇసి కాలేజీలో డాక్టర్ విజయ నిర్మల మెమోరియల్ సౌత్ ఇండియా అండర్-14 మార్షల్ ఆర్ట్స్, యోగాసన పోటీలు ఆదివారం నిర్వహించగా తమ విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు. బాలికల విభాగంలో కె.నాగ వినీత, ఒ.వెస్లీ, ఆర్.దీప్తి, డి.నిస్సి, కె.స్వరూపరాణి, బాలుర విభాగంలో డి.అజయ్ కుమార్, షేక్ హయ్యద్ బాజీ పతకాలు పొందారని చెప్పారు. విద్యార్థులతోపాటు పిఇటి ఎ.సుజాతను అభినందించారు.

కరాటే జాతీయ స్థాయి పోటీల్లో 'నారాయణ' విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



కాశ్మీర్‌లోని శ్రీనగర్‌లో ఈ నెల 16, 17, 18 తేదీల్లో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో తమ పాఠశాల 9వ తరగతి విద్యార్థి షరీఫ్ బాషా తృతీయ స్థానం సాధించినట్లు నారాయణ ఇంగ్లీషు మీడియం స్కూల్ ప్రిన్సిపల్ ప్రిన్సిపల్ వి.వి.ఎస్.సి ప్రసాద్ సోమవారం తెలిపారు. నరసరావుపేట పట్టణం రామిరెడ్డిపేటలోని పాఠశాలలో విద్యార్థి అభినందన సభ నపిర్వహించగా ప్రిన్సిపాల్‌తోపాటు ఎజిఎం వై.లక్ష్మణ్‌రెడ్డి, డీన్ అనిల్ తదితరులు షరీఫ్‌ను అభినందించారు. రానున్న రోజుల్లోనూ ఇదే ఒరవడితో ఆడి పల్నాడు జిల్లాకు, పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.

వార్డుల్లో సమస్యలు కోకొల్లలు

- పారిశుధ్య కార్మికుల కొరత
- నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం
- శునకాలతో భయం.. భయం
- పరిష్కారానికి నోచుకోని బుర్రిపాలెం డంపింగ్ యార్డు సమస్య
- టిడిపి, వైసిపి కౌన్సిలర్ల ఏకరువు


చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక

ప్రజాశక్తి తెనాలి రూరల్

తెనాలి మున్సిపల్ కార్యాలయం కౌన్సిల్ హాల్లో నిర్వహించిన అత్యవసర సమావేశం కొంత వాడి, వేడిగా ముగిసింది. సోమవారం ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో అజెండాలోని 25 అంశాలను చర్చించకముందే వార్డుల్లో నెలకొన్న సమస్యలను సభ్యులు ఎకరువుపెట్టారు. ముందుగా అజెండాలోని పేర్కొన్న మొదటిగా 2వ వార్డు మెంబరు అన్నాబత్తుని పద్మజకు సంబంధించిన సభ్యత్వాన్ని పునరుద్ధరించాలన్న అంశాన్ని సభ్యుల ఆమోదంతో వాయిదా వేశారు. చర్చనీయాంశాలకు ముందే 27వ వార్డు మెంబరు బోయపాటి అరుణ తన వార్డులో నెలకొన్న సమస్యలపై మండిపడ్డారు. ముఖ్యంగా పారిశుధ్యం నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనబడుతుందన్నారు. పారిశుధ్య కార్మికుల కొరతతో రోడ్లు, డ్రైనేజి, మరుగుదొడ్ల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందన్నారు. ఏజెండాలోని అంశాలపై అవగాహన చేసుకునే సమయాన్ని ఇవ్వకుండా అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేయడంపై 19వ వార్డు మెంబరు పసుపులేటి త్రిమూర్తి అసంతప్తి వ్యక్తం చేశారు. నూతన వాహనాల కొనుగోలు, పారిశుధ్య వాహనాల మరమ్మతులు, నీటి పన్నుల గణాంకాలపై వివరణ లేకుండా మున్సిపల్ నిధులను దుర్వినియోగం చేస్తున్నారని 19వ వార్డు పసుపులేటి త్రిమూర్తి అధికారులను ప్రశ్నించారు. పారిశుధ్య కార్మికుల కొరత కారణంగా పట్టణంలో అపరిశుభ్రత నెలకొందని తెనాలి మాజి వైస్ చైర్పర్సన్ గుంటూరు కోటేశ్వరరావు తన వాదన వినిపించారు. అధికారులు అలసత్వం కారణంగా కార్మికులు పనులను చేయకుండా కాలయాపన చేస్తున్నారని పిర్యాదు చేశారు. ముఖ్యంగా పట్టణంలో శునకాలు బెడద ఎక్కువగా ఉందని, మహిళలు, విద్యార్థులు, చిన్నారులు బయటికి వెళ్ళాలంటే భయాందో ళనలు చెందుతున్నారని సభ్యులు విన్నవించారు. బుర్రిపాలెం డంపింగ్ యార్డు సమస్యలను పరిష్కరించాలని 4వ వార్డు సభ్యులు అడుసుమల్లి వెంకటేశ్వరరావు అన్నారు. కౌన్సిలర్లు అన్నం పిన్నారావు, తాడి పోయిన రామయ్య, దేసు యుగంధర్, అత్తోట నాగవేణి, పేరం సంజీవరెడ్డి కొర్రపాటి లక్ష్మి, కొమరాభత్తిన జైపాల్ తదితరులు తమ వార్డుల్లో సమస్యలపై అధికారులను ప్రశ్నించారు. మున్సిపల్ ఇంజనీర్ , సహాయ కమిషనర్ లక్ష్మీపతి, ఎంహెచ్ఓ డాక్టర్ హెలెన్ నిర్మల, మున్సిపల్ రెవెన్యూ అధికారి యన్ రామప్రసాద్, అసిస్టెంట్ ఇంజనీర్ చైతన్య సభ్యుల ప్రశ్నలకు వివరణ ఇచ్చారు. అనంతరం చైర్పర్సన్ రాధిక మాట్లాడుతూ వార్డుల్లో పారిశుధ్య సమస్యలు, మురుగు కాల్వలు, నీటి సమస్యలపై వచ్చిన విన్నపాలను త్వరలో పరిష్కరిస్తామని అన్నారు. రాష్ట్ర పౌర సరఫరాలు శాఖ మంత్రి ఆధ్వర్యంలో పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనుల అంచనాలు, 15వ ఆర్థిక సంఘం అభివృద్ధి ప్రణాళిక విడతలుగా మంజూరైన నిధులు, అభివృద్ధి పనుల అంచనాలపై చర్చనీయాంశాల్లో పొందుపరిచామని తెలిపారు. ఒకటి, రెండు మినహా అజెండాలోని మిగిలిన అంశాలను సభ్యులు ఆమోదం తెలిపారన్నారు. తెనాలి పట్టణ సుందరీకరణలో భాగంగా రద్దీ ప్రాంతాల్లో రోడ్లు విస్తరణ, పారిశుధ్య సమస్యలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. అజెండాలో టెండర్ల ప్రకటనలపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పురపాలక సంఘ కౌన్సిల్ సభ్యులు, ఎక్స్ అఫిషియో మెంబర్లు, కోఆప్షన్ మెంబర్లు పాల్గొన్నారు.


సమావేశంలో ప్రశ్నిస్తున్న కౌన్సిలర్ బోయపాటి అరుణ


పరిశీలిస్తున్న ఐజి, ఎస్‌పి

పోలీసు శాఖలో ఉద్యోగోన్నతి పరీక్షలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఎఎస్ఐ నుంచి ఎస్ఐగా పదోన్నతి పొందేందుకు నిర్వహిస్తున్న రాత పరీక్షలను సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో సౌత్ పోస్టల్ జోన్ గుంటూరు రేంజ్ ఐజి సర్వ శ్రేష్ట త్రిపాఠీ, జిల్లా ఎస్‌పి సతీష్ కుమార్ పరిశీలించారు. ఒంగోలు పోలీస్ ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపల్ కమాండంట్ ఎస్‌పి నగేష్ బాబు ప్రకాశం జిల్లా అదనపు ఎస్‌పి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గుంటూరు రేంజి పరిధిలోని గుంటూరు, ప్రకాశం బాపట్ల, నెల్లూరు,పల్నాడు జిల్లాల్లో పనిచేస్తున్న 58 మందికి పదోన్నతి కోసం ఈ పరీక్షలతు నిర్వహించామని ఐజి సర్వశ్రేష్ట త్రిపాఠి తెలిపారు. ఉదయం 100 మార్కులకు, మధ్యాహ్నం 100 మార్కులకు భారతీయ న్యాయ సంహిత చట్టం, భారతీయ నాగరికత సురక్ష సంహిత చట్టం, స్థానిక మరియు ప్రత్యేక చట్టాలకు సంబంధించి ఈ పరీక్షలు జరిగాయి.



పవర్ లిఫ్టింగ్ పోటీల్లో చంద్రికకు బంగారు పతకం

ప్రజాశక్తి - మంగళగిరి

సౌత్‌రన్ రైల్వే సేలమ్ డివిజన్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీ నుంచి 24వ తేదీ వరకు తమిళనాడు రాష్ట్రం సేలమ్ లో నిర్వహించిన సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన బొల్లినేని చంద్రిక బంగారు పతకాన్ని సాధించింది. స్క్వాట్ 250 కేజీలు, బెంచ్ ప్రెస్ 110 కేజీలు, డెడ్ లిఫ్ట్ 200 కేజీలు, మొత్తం 560 కేజీల బరువును ఎత్తి స్ట్రాంగెస్ట్ ఉమెన్ ఇన్ సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ -2024 అవార్డును కైవసం చేసుకుంది. సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో బంగారు పతకం సాధించిన చంద్రిక కు పలువురు అభినందనలు తెలిపారు.

జాతీయస్థాయి పోటీలకు వేజెండ్ల విద్యార్థిని

ప్రజాశక్తి - చేబ్రోలు



జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు జడ్పీ హెచ్ఎస్ వేజెండ్ల 8వ తరగతి విద్యార్థిని కోట్ల నాగమల్లేశ్వరి ఎంపిక అయ్యిందని సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి విజయశ్రీ తెలిపారు. ఇటీవల విజయనగరం జిల్లా భోగాపురంలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 14 బాలికల వాలీబాల్ జట్టులో గుంటూరు జిల్లా నుండి ప్రాతినిధ్యం వహించి, టీం కెప్టెన్‌గా వ్యవహరించిన నాగమల్లేశ్వరి జాతీయస్థాయిలో ఆడేందుకు ఎంపికైందన్నారు. డిసెంబర్ 7నుండి 11 వరకు వారణాసిలో జరిగే జాతీయ పోటీలలో రాష్ట్రం తరపున మల్లేశ్వరి పాల్గొంటుందన్నారు. తమ పాఠశాల విద్యార్థిని జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల వ్యాయామ ఉపాధ్యాయులు టి వెంకటేశ్వరావు, నాగమల్లేశ్వరిలను ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ పఠాన్ రబియా ,కమిటీ సభ్యులు అభినందించారు.


నమూనాలను పరిశీలిస్తున్న ఉప విద్యాశాఖ అధికారి

ఆకట్టుకున్న పర్యావరణ సైన్స్ ప్రదర్శన

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక పాత బస్టాండ్ వద్ద పరీక్షాభవన్‌లో సోమవారం ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్‌కోర్ సౌజన్యంతో జిల్లాస్థాయి పర్యావరణ సైన్స్ కాంగ్రెస్-2024 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గుంటూరు ఉప విద్యాశాఖాధికారి పి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యత కాపాడవలసిన బాధ్యత మనందరిపైన ఉందని తెలిపారు. ప్లాస్టిక్ మానవాళికి పెనుభూతంగా మారిందని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించకపోతే అది మానవ మనుగడకే ప్రమాదమని అన్నారు. ఈ సందర్భంగా 'చెత్త నుండి సంపద తయారు చేయుట' అనే అంశంపై ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ ఎంతగానో ఆకట్టుకుంది. ఇందులో విద్యార్థులు వివిధ రకాల నమూనాలను తయారుచేసి ప్రదర్శించారు. అలాగే పర్యావరణ కాలుష్యం తగ్గిండానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనే అంశంపై విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 94 పాఠశాలల నుండి 225 మంది విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొన్నట్లు జిల్లా సైన్స్ అధికారి షేక్.గౌసుల్ మీరా తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు రమణయ్య, జ్యోతికిరణ్, నాగేంద్రమ్మ, డిసిఈబి సెక్రటరీ తిరుమలేష్, ఉర్దూ పాఠశాలల డిఐ మొహమ్మద్ ఖాసిం తదితరులు పాల్గొన్నారు. సైన్స్ ఎగ్జిబిషన్‌లో కొలకలూరు, కాకుమాను, దుగ్గిరాల జెడ్పీ హైస్కూళ్లు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించాయి. డ్రాయింగ్‌లో వేడికొండూరు జెడ్పీ హైస్కూల్, గుంటూరు చౌత్రాలోని గవర్నమెంట్ ఉర్దూ బాలికల పాఠశాల ఎస్.కె.బి.ఎం కార్పొరేషన్ ఉన్నత పాఠశాల ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించాయి.

ఎపి జెనెటిక్స్‌పై చలపతిలో అవగాహన



ప్రజాశక్తి-గుంటూరు : జీవనశైలిలో మార్పులు, ఆహారం, వ్యాయామం, మనసు స్థితి వంటి వాటి ద్వారా జన్యువుల ప్రభావం ఎలా మారుతుందో ఎపి జెనెటిక్స్ పరిశోధిస్తుంది అని క్వాంటమ్ హీలింగ్ ట్రైనర్, హీలర్ ఎస్.భాస్కర్ అన్నారు. సోమవారం చలపతి ఫార్మసీ కళాశాలలో జరిగిన అవగాహనా కార్యక్రమంలో భాస్కర్ మాట్లాడుతూ ఒక వ్యక్తిలో ఒత్తిడి తగ్గించే పద్ధతులను అభివృద్ధి చేయడం, స్వీయ-హిప్నాసిస్, విజువలైజేషన్ లేదా ధ్యానం, ఆరోగ్యంపై ఆలోచనలు, మనస్సు యొక్క శక్తిని ఉపయోగించడం ద్వారా వారి వ్యాధి రోగ నిరోధక ప్రతిస్పందనను పెంచుకోవచ్చని అన్నారు. మన ఆరోగ్యం, జీవనశైలిని ప్రభావితం చేసే ప్రధానమైన అంశాలు జీవశాస్త్రంలో విప్లవాత్మకంగా పరిశోధనలను తీసుకొచ్చాయని, వాటిలో ఒకటైన, ధ్యానం ఒక ప్రభావం తమైన సాధనంగా ఎపిజెనెటిక్స్‌పై ప్రాముఖ్యతను సాధించుకుందన్నారు. జీవశాస్త్రంలో ఎపిజెనెటిక్స్ మన డిఎన్ఎలో మార్పులు లేకుండా, జన్యువుల పనితీరును ప్రభావితం చేసే ప్రక్రియ అని, ఆహారం, వ్యాయామం, ఆలోచన శక్తి, ఒత్తిడి లాంటి బయోపర్యావరణం ఈ మార్పులను ప్రభావితం చేస్తాయన్నారు. కార్యక్రమానంతరం భాస్కర్‌ను కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామారావు సత్కరించారు.

ఫిజియోథెరపీ విద్యకు ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి-గుంటూరు

ఫిజియోథెరపీ విద్యకు ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు విస్తతంగా ఉన్నాయని లలిత సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఫిజియోథెరపీ విభాగాధిపతి డాక్టర్ జి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఆర్టీసీ కాలనీ హారిక కాలేజ్ ఆఫ్ ఫిజియో థెరపీలో నూతన విద్యార్థులకు స్వాగత వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఫిజియోథెరపీ రంగంలో ఎప్పటికప్పుడు అధునాతన సాంకేతిక యంత్రాలు, పనిముట్లు, వాటిని వివరించి చెప్పే విద్య అభివద్ధి చెందుతున్నట్లు తెలియజేశారు. జబ్బుల నుండి కోలుకున్న రోగులకు పూర్తిస్వాంతన చేకూర్చటంలో ఫిజియోథెరపీ ముఖ్య పాత్ర పోషిస్తుందని చెప్పారు. విద్యార్థులు క్రమశిక్షణతో, శ్రద్ధతో, కొత్త విషయాలు తెలుసుకునేందుకు చొరవ, ఆసక్తి చూపాలని ఉద్బోధించారు. సభకు కళాశాల డైరెక్టర్ డాక్టర్ సుభాని అధ్యక్షత వహించారు.కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మహీనా షేక్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వి. హరికష్ణ, ప్రొఫెసర్ శ్యామ్యూల్‌సతీష్, ప్రొఫెసర్ కోటేశ్వరరావు, డాక్టర్ రాజేంద్ర, డాక్టర్ మదుల, డాక్టర్ దయాకర్ డాక్టర్ శిరీష తదితరులు పాల్గొన్నారు


ఫ్రెషర్స్‌డే వేడుకలను ప్రారంభిస్తున్న డాక్టర్ శ్రీనివాసరావు, తదితరులు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ఉద్యోగులు సమయపాలన పాటించాలి

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండేలా మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ వీడియోకాన్ఫరెన్స్ ద్వారా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరవుతున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని, నిబంధనల ప్రకారం విధులకు హాజరు కాని వారిపై చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. ప్రతిరోజూ నూరుశాతం ఆన్‌లైన్ హాజరు వేసేలా చూడాలన్నారు. హౌసింగ్ లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాల పురోగతిపై నిరంతరం పర్యవేక్షించాలన్నారు. 1 నుండి 10వ తరగతి విద్యార్థులతోపాటు, ఇంటర్ విద్యార్థులకూ అపార్ ఐడి రూపొందించేలా ప్రత్యేకాధికారులు, ఎంపిడిఒలు చర్యలు తీసుకోవాలన్నారు. బ్యాంక్ అకౌంట్ల ఈకెవైసికి సంబంధించి సర్వే, గృహాల జియోట్యాగింగ్ నంబర్ 29 నాటికి పూర్తి చేయాలన్నారు. తెనాలిలో చేపట్టిన ఎంఎస్ఎంఇ పైలెట్ ప్రాజెక్ట్ సర్వేను డిసెంబర్ 29లోగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో సిపిఒ శేషశ్రీ, హౌసింగ్ పీడీ ప్రసాద్, డిపిఒ సాయికుమార్, డ్వామా పీడీ శంకర్, డిఇఓ రేణుక తదితరులు పాల్గొన్నారు.

29 వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

మాచర్ల పట్టణంలో సోమవారం నుండి 29వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ కాంప్యులు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వేణుబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎడ్యుకేషనల్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ కె.రాజు ఆధ్వర్యంలో ఆధార్ అప్డేట్ కార్యక్రమం నిర్వహించనున్నారు. సుద్దగుంతల సచివాలయం పరిధిలో పిడబ్ల్యూడీ కాలనీ, జిల్లా పరిషత్ బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, రోప్‌వే కాలనీ సచివాలయం పరిధిలో కిడ్స్ పాఠశాలలో ఈ క్యాంపులు ఉంటాయని తెలిపారు. ఆధార్ లో మార్పులు చేర్పులు, ఐదేళ్ల నుండి ఏడేళ్లు.. ఏడేళ్ల నుండి 15 ఏళ్ల వారికి ఉచితంగా వేలిముద్రలు అప్డేట్ చేస్తారని తెలిపారు.

పెట్రోల్ బంక్‌కు ఎమ్మెల్యే శంకుస్థాపన

ప్రజాశక్తి- వెల్దుర్తి

మండలంలోని శిరిగిరిపాడు శివారులో పెట్రోల్ బంకుకు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. మండలంలో పెట్రోల్ బంకు లేకపోవటంతో ఈ ప్రాంత వాసులు ఇబ్బందులు పడుతున్నారని, వెల్దుర్తి ప్రాంతంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు రైతులకు సహాయ పడుతుందని ఎమ్మెల్యే చెప్పారు. ఇదిలా ఉండగా అనారోగ్యానికి గురై వివిధ ఆసుపత్రుల్లో నందు వైద్యం చేయించుకున్న 27 మందికి సిఎం సహాయనిధి నుండి రూ.34 లక్షలు మంజూరవగా చెక్కులను వెల్దుర్తిలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అందించారు. కార్యక్రమాల్లో నాయకులు కె.శివారెడ్డి, కె.రామాంజిరెడ్డి, ఎన్.గురవారెడ్డి పాల్గొన్నారు.



స్వామి వివేకానంద సేవాశ్రమానికి ఫ్యాన్లు బహూకరణ

ప్రజాశక్తి- మాచర్ల

స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహిస్తున్న స్వామి వివేకానంద సేవాశ్రమానికి మీనాక్షి కంటి హాస్పిటల్ డైరెక్టర్, రోటరీ క్లబ్ సీనియర్ సభ్యులు మారేపల్లి లక్ష్మీనారాయణ రూ.20 వేలతో 6 సీలింగ్ ఫ్యాన్‌లను సోమవారం అందజేశారు. సేవాశ్రమంలో ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్, ఏపీఆర్జేసీ కోచింగ్, స్పోకెన్ ఇంగ్లీష్ క్లాసులు నిర్వహించే సమయంలో ఫ్యాన్స్ లేక విద్యార్థులు చాలా ఇబ్బంది పడుతున్న విషయాన్ని లక్ష్మీనారాయణ దృష్టికి తీసుకెళ్లగా వీటిని సమకూర్చారని ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పల్నాడు, ప్రతిభా కాలేజీల డైరెక్టర్ నాగూర్‌వలి, సేవాశ్రమం విద్యార్థులు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో 'తిరుమల' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

38వ యాన్యువల్ సౌత్ ఇండియా మార్షల్ ఆర్ట్స్ చాంపియన్షిప్ టోర్నమెంట్‌ను నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం నిర్వహించగా యోగాలో తమ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారని తిరుమల ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవి నారాయణ తెలిపారు. పి.యేసు మరియమ్మ, జి.కపిల్ కుమార్, నటరాజ్ ప్రథమ స్థానం సాధించారని చెప్పారు. వీరితోపాటు కళాశాల యోగా శిక్షకులు రంగలక్ష్మిని అభినందించారు.



స్థల వివాదాలపై కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చే ప్రతిఫిర్యాదూ పరిష్కారం కావాలని అధికారులను పల్నాడు జిల్లా జెసి సూరజ్ ఆదేశించారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్రజల నుండి 34 అర్జీలను జెసితోపాటు డిఆర్ఒ మురళి, ఇతర అధికారులకు స్వీకరించారు.

పొలం కాజేయాలని బంధువుల యత్నం



స్థానికంగా లేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని రొంపిచర్లలో తనకు వారసత్వంగా వచ్చిన 3.88 ఎకరాలను సమీప బంధువులు మేడికొండ శివారెడ్డి, పడాల పోలమ్మ, పడాల రామకోటిరెడ్డి కాజేయాలని చూస్తున్నారని బాపట్ల జిల్లా కారంచేడు మండలం యర్రంవారిపాలేనికి చెందిన పడాల వెంకటరెడ్డి ఫిర్యాదు చేశారు. నకిలీ పత్రాలు సృష్టించి తమ పేరిట వెబ్ ల్యాండ్‌లోనూ నమోదు చేయించుకున్నారని, దీనిపై ఏళ్ల తరబడి రెవెన్యూ కార్యాలయాలు చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదని వాపోయారు.

వెబ్‌ల్యాండ్‌లో పొలం నమోదుకు తాత్సారం



సత్తెనపల్లి మండలం పాకాలపాడు రెవెన్యూ పరిధిలో వారసత్వంగా వచ్చిన రెండెకరాల పొలాన్ని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నానని, రెవిన్యూ అధికారులు నిర్లక్ష్యంతో అరెకరం పొలాన్ని తమ భూమి పక్కనున్న చన్నమల్లు శ్రీహరి పేరిట వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేశారని, దీనిపై ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని సత్తెనపల్లి మండలం రెంటపాళ్లకు చెందిన చన్నమల్లు శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు.

కొంత పొలాన్ని హద్దుదార్లు ఆక్రమించారు



పిడుగురాళ్ల సమీపంలో గల తమ పొలం పక్కన హద్దుదారులు తమకు సమాచారమేమీ ఇవ్వకుండా తమ భూమికి హద్దు రాళ్లు వేసుకున్నారని, తీరా తన భూమిలో 5 సెంట్లు తగ్గిందని పిడుగురాళ్లకు చెందిన వికలాంగుడు అచ్చి వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశ్శారు. తన భూమికి సంబంధించి ఆధారాలన్నీ ఉన్నాయని, విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరారు. దీనిపై గతంలోనే రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదన్నారు.

ట్రై సైకిల్ ఇప్పించండి



పుట్టుకతో పోలియో సోకి కాళ్ళు చచ్చుబడి పోయాయని మూడు చక్రాల వాహనం లేక ఇబ్బందులు పడుతున్నానని మూడు చక్రాల బ్యాటరీ వాహనం మంజూరు చేయాలని నాదెండ్ల మండలం చందవరానికి చెందిన వికలాంగుడు షేక్ మస్తాన్‌వలి కోరారు.

ఓబీసీల కుల జనగణన చేపట్టాలి



రాష్ట్ర ప్రభుత్వం జరిపించే జనగణనతో పాటుగా సమగ్ర ఓబీసీ కుల జనగణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీను డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన తెలిపి కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన బీసీ రక్షణ చట్టంను అమల్లోకి తేవాలన్నారు. సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.మురళి మాట్లాడుతూ 52 శాతంగా ఉన్న బీసీల వాటాను 15 శాతంగా ఉన్న ఆధిపత్య వర్గాలు అనుభవిస్తున్నాయని విమర్శించారు. బీసీలపై దాడులను, అన్యాయాలను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో వై.కొండల గౌడ్, కె.రమేష్, షేక్ సిద్దయ్య, కె.బాలాజీ, ఎన్.గురుఆంజనేయులు, బి.శ్రీనివాసరావు, విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

సిమెంట్ కంపెనీ పేలుళ్లతో ఇళ్లకు బీటలు

ప్రజాశక్తి - దాచేపల్లి : చెట్టినాడ్ సిమెంట్ క్వారీలో పేలుళ్ల నుండి తమ కాలనీని కాపాడాలని మండలంలోని పెదగార్లపాడు బీసీ కాలనీ వాసులు తహశీల్దార్‌కు విన్నవించారు. పేలుళ్ల వల్ల తమ ఇళ్లు నెర్రెలు వస్తున్నాయని, సిమెంటు ఫ్యాక్టరీకి ఇచ్చిన పరిమితిని



మించి ఎక్కువ మొత్తంలో బ్లాస్టింగ్ చేస్తున్నారని చెప్పారు. గ్రామంలోని తాగునీరు సైతం కలుషితమవుతోందని, ఆ నీరు వల్ల చర్మం మీద దర్దుర్లు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీ వాసులకు సిమెంటు ఫ్యాక్టరీ యాజమాన్యం ప్రత్యామ్నాయంగా పక్కా ఇళ్లు నిర్మించాలని, సురక్షిత నీరు అందించేలా చూడాలని, లేకుంటే ఫ్యాక్టరీ వద్ద ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, పెద్ద గార్లపాడు మాజీ ఎంపీటీసీ కె.రామారావు, వి.తిరుమల కుమార్, ఎం.చంద్రశేఖరరావు, టి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలిచ్చి ఇళ్లు నిర్మించాలి

ప్రజాశక్తి - వినుకొండ



పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతంలో 2 సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలతోపాటు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఐ, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో ర్యాలీ, తహశీల్దార్ కార్యాలయం వద్దకు నిరసన చేపట్టారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం 30 లక్షల మందికి ఇంటి స్థలాలిచ్చి నిర్మాణం చేపడతానని చెప్పినా సెంటు భూమి కేటాయించి అవి కూడా పట్టణాలకు 7,8 కిలోమీటర్ల దూరంలో ఇచ్చి మోసం చేసిందన్నారు. భూములు కొనుగోలు ఎమ్మెల్యేలకు అప్పగించి రూ.వేల కోట్ల అవినీతి పాల్పడ్డారని అన్నారు.మాజీ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు ఎకరం రూ.మూడు నాలుగు లక్షలు పెట్టి కొనుగోలు చేసి అదే భూమిని ప్రభుత్వానికి రూ.18 లక్షలు చొప్పున అమ్మారని విమర్శించారు. టిట్కో గృహాల పంపిణీనీ చేపట్టలేదన్నారు. అనంతరం తహశీల్దార్ సురేష్ నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్, నాయకులు ఎస్.సైదా, పి.లాల్‌ఖాన్, బి.శ్రీనివాసులు, రాము, మల్లికార్జునరావు, పవన్‌కుమార్, పద్మ, కాసమ్మ, రమణమ్మ, గోవిందమ్మ పాల్గొన్నారు.

బెజగం రవికుమార్‌కు మరో పురస్కారం

ప్రజాశక్తి-సత్తెనపల్లి



పట్టణానికి చెందిన బెజగం రవికుమార్‌కు గౌతమేశ్వర, ఆర్యాణి సకల కళావేదిక 'చతుర్ముఖ సింహ' పురస్కారం ప్రదానం చేశారు. ఈ మేరకు ఆదివారం తెంగాణ రాష్ట్రం కరీంనగర్‌లోని ఫిల్మ్ భవన్ ఆడిటోరియంలో పురస్కారాన్ని ప్రముఖ కవి, విమర్శకులు వైరాగ్యం ప్రభాకరం, ఒమార్ సజన్ ఖాన్, మేజిక్ రాజా, ప్రముఖ కవి పార్ల వేణుగోపాల్‌రావు, అరుణ్ భట్టువర్, కుంచాల లావణ్య నుండి అందుకున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో విశిష్ట ప్రావీణ్యం పొందిన సాహిత్య, పౌరాణిక రంగస్థలం, కవిత్వం, సమాజ సేవా రంగాల్లో పురస్కారాలు ప్రదానం చేయగా రవికమార్‌కు పౌరాణిక రంగం నుంచి ఈ గౌరవం దక్కింది. 2022 నుండి 2024 నవంబర్ వరకు రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో 42 పురస్కారాలను రవికుమార్ అందుకున్నారు. రంగస్థల పౌరాణిక రంగంలో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లోని 15 కళా సంస్థల నుండి వీటిని పొందారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

నిబంధనలు పాటించకే రోడ్డు ప్రమాదాలు

ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో నరసరావుపేటలో అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



మానవహారంలో మాట్లాడుతున్న సిఐ

రోడ్డు భద్రతా నియమాలను పాటించకపోవడమే రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణమని ట్రాఫిక్ సిఐ సిహెచ్.లోకనాథం, నరసరావుపేట టూటౌన్ సిఐ హైమారావు అన్నారు. ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కోసం సోమవారం విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. నరసరావుపేట పట్టణంలోని గడియారం సెంటర్ సమీపంలోని మునిసిపల్ హైస్కూల్ నుంచి ప్రారంభమైన ర్యాలీ మల్లమ్మ సెంటర్ మీదుగా తిరిగి హైస్కూల్ వరకు సాగింది. మల్లమ్మ సెంటర్ వద్ద విద్యార్థులు మానవహారం ఏర్పాటు చేశారు. సిఐలు మాట్లాడుతూ నిర్లక్ష్యంగా వాహనాలను నడపడం, విశ్రాంతి లేకుండా ఎక్కువ దూరం వాహనం నడపడం, వ్యతిరేక దిశలో ప్రయాణించడం కూడా ప్రమాదాలకు కారణమన్నారు. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించక పోవడం, అతివేగం, యూ - టర్న్ తీసుకునేటప్పుడు చుట్టూ వున్న వాహనాలను గమనించక పోవడం రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలని తెలిపారు. కుటుంబంలో ఏ వ్యక్తి అయినా ప్రమాదానికి గురైనా లేదా మరణించిన వారి కుటుంబాలు ఎన్నో ఇబ్బందులకు గురవుతాయని చెప్పారు. వాహనాలను నడిపేటప్పుడు తగిన జాగ్రత్తలను పాటించాలని సూచించారు. రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు క్షతగాత్రులకు ధైర్యం చెప్పి, వారిని త్వరితగతిన వైద్య సహాయం అందేలా చూడడం అందరి బాధ్యతన్నారు. అతివేగం, ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, ఓవర్ లోడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, సెల్ ఫోన్ డ్రైవింగ్, ఆటో సైడ్ సిట్టింగ్, డెఫెక్టీవ్ నంబర్ ప్లేట్స్, అనధికార పార్కింగ్ మొదలైన చట్టపరమైన ఉల్లంఘనలకు పాల్పడొద్దని వాహనదార్లకు సూచించారు. ర్యాలీలో ట్రాఫిక్ ఎస్ఐ వేణు, వన్‌టౌన్ ఎస్ఐ అరుణ, మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం రవికాంత్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి 7
గుంటూరు జిల్లా
మంగళవారం 26 నవంబర్ 2024

వంద పడకల ఆసుపత్రికి త్వరలో శంకుస్థాపన

మంగళగిరి ప్రభుత్వం ఆస్పత్రిని సందర్శించిన చిల్లపల్లి - ప్రజారోగ్య వేదిక పోరాటాలకు ప్రశంస

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా నిర్మించడానికి త్వరలో శంకుస్థాపన కార్యక్రమం జరుగుతుందని ఏపీ ఎంఎస్ ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం సాయంత్రం ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి అనంతరం మీడియాతో మాట్లాడారు. మంత్రి నారా లోకేష్ ఎన్నికల ముందు నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా రూ.52 కోట్ల వ్యయంతో నిర్మించడానికి నిధులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. 2005 జనవరి నెలలో ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన జరిగే అవకాశం ఉందని తెలిపారు. అందుకు తగిన విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఆస్పత్రి స్థలాన్ని కాపాడటానికి ప్రజారోగ్య వేదిక చేసిన పోరాటాలను ఆయన గుర్తు చేశారు. ఆసుపత్రి స్థలాన్ని కజ్జా చేయడానికి కూడా గత



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న చిల్లపల్లి శ్రీనివాసరావు

ప్రభుత్వం ప్రయత్నించిందని దాన్ని అడ్డుకోవడం కూడా ప్రజా ఆరోగ్య వేదిక చేసిందని అన్నారు. అన్ని వసతులతో ప్రభుత్వ ఆసుపత్రిని నిర్మించి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే లోకేష్ ప్రయత్నమనే అన్నారు. ప్రజా ఆరోగ్య వేదిక నాయకులు డాక్టర్ ఎం వంశీకృష్ణ మాట్లాడుతూ డి ఎం ఈ పరిధి నుండి వైద్య విధాన పరిషత్‌లోకి ఈ ఆసుపత్రిని మార్చడానికి గతంలో అనేక సంవత్సరాలు ప్రయత్నించినప్పటికీ ఫలించలేదని అన్నారు. మంత్రి నారా లోకేష్ 40 రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేసి వైద్య విధాన పరిషత్తులోకి తీసుకురావడం జరిగిందని అన్నారు. సమావేశంలో భార్గవ్ కన్సల్టెంట్స్ ఎండి ఏ భార్గవ్, ప్రతినిధులు ఏ అనిల్ కుమార్, ఏ శ్యాం కుమార్, టిడిపి పట్టణ అధ్యక్షులు దామర్ల రాజు, ప్రజా ఆరోగ్య వేదిక నాయకులు ఎం నాగేశ్వరావు పాల్గొన్నారు.

రైతులు వివరాలు నమోదు చేసుకోవాలి : ఎఒ

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - దుగ్గిరాల : ధాన్యం రైతు దైన్యమని ప్రజాశక్తి వార్తాపత్రికలో సోమవారం వచ్చిన కథనానికి స్పందన లభించింది. ప్రభుత్వ యంత్రాంగం కదిలినది. ధాన్యం అమ్మదల్చుకున్న రైతులు తమ వివరాలు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి పి శిరీష వార్తాపత్రికల ద్వారా రైతులకు తెలియజేశారు. అయితే నిబంధనలు షరా మామూలే. తేమ, మట్టి గడ్డలు కౌలు రైతు అయితే భూ యజమాని పాస్ పుస్తకము తదితర అంశాలతో కూడిన ఈ ప్రకటన రైతులకు ఏమాత్రం లాభదాయకం కాకపోవచ్చు.

నెల రోజుల విరామం తర్వాత ప్రజాదర్బార్

ప్రజాశక్తి-తాడేపల్లి



ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ విరామం తర్వాత సోమవారం తన నివాసంలో ప్రజా దర్బార్ ప్రారంభిం చారు. ఈ సంద ర్భంగా నియోజక వర్గ నుండే గాక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు తమ సమస్యలు పరిష్కరించమని అర్జీలు అందజేశారు. తాడేపల్లి మండలం ఇప్పటం గ్రామానికి చెందిన మధుసూదన్ రెడ్డి తనకు చెందిన 3-10 ఎకరాల భూమిని కుటుంబ అవసరాల కోసం కుదవ పెడితే, వడ్డీతో సహా డబ్బులు చెల్లిస్తాం అన్న తనకు ఇవ్వటం లేదని గరుగు కృష్ణకుమారి మంత్రి లోకేష్ కు అర్జీ సమర్పించారు. మంగళగిరి పట్టణానికి చెందిన రోజా అనే మహిళ తనకు ఇంటి స్థలం లేదని స్థలం ఇప్పించి, ఇల్లు నిర్మాణం కి ఆర్థిక సాయం అందిం చాలని, తీసుకున్న అప్పులకు పొలం రాసివ్వాలని, వైసీపీ నాయకులు దేవినేని అవినాష్ పేరు చెప్పి అక్రమ కేసులు పెట్టి తమను బెదిరి స్తున్నారు అని, పరిశీలించిన న్యాయం చేయాలని పెదవడ్లపూడి కి చెందిన ఏ కృష్ణ హర్ష, ఏ వినోద్ లోకేష్‌కు వినతి పత్రం అంద జేశారు. ఉన్నత చదువులు చదివిన తమ పిల్లలకు ఉద్యో గాలు ఇప్పించాలని, ఆర్థికసాయం చేస్తే చిన్నపాటి వ్యాపా రం చేసుకుంటానని వికలాంగుడు అర్జీ ఇచ్చారు.



పమిడివారిపాలెం లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఏవో సుధారాణి





ఎంపిడిఒ కి వినతి పత్రం ఇస్తున్న సచివాలయం ఇంజినీర్ అసిస్టెంట్లు

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - పెదనందిపాడు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్రాల ద్వారా సోమవారం మండలంలోని పమిడివారిపాలెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వ్యవ సాయ అధికారిని బి సుధారాణి ప్రారంభించారు. ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా రైతులు వడ్లు తీసుకురావాలని కోరారు. వడ్లు సాధారణ రకం క్వింటాకు రూ.2,300, గ్రేడ్ ఎ రకం రూ.2320 కొనుగోలు చేస్తారని తెలిపారు. రైతు సేవా కేంద్రాలలోని సిబ్బంది ద్వారా పేర్లు నమోదు చేయించుకోవాలని, గోనె సంచులు ఉచితంగా ఇస్తారని తెలిపారు. లేబర్ చార్జీలు, రవాణా ఖర్చులు కూడా ప్రభుత్వమే భరిస్తుందన్నారు. అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకొవాలన్నారు.

గిరిజనుల ఆత్మబంధువు వెన్నెలకంటి రాఘవయ్య

ప్రజాశక్తి-గుంటూరు

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, గిరిజన సేవకుడు వెన్నెలకంటి రాఘవయ్య ఆశయాలను కొనసాగించాలని స్టేద్వా అధ్యక్షులు బాపట్ల ఏసుబాబు, వబ్బాని ఏడుకొండలు, చలంచర్ల శ్రీనివాసరావు అన్నారు. రాఘవయ్య 43వ వర్ధంతి సందర్భంగా నాజ్ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి యానాది గిరిజనులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలలో మైదానప్రాంత గిరిజనులకు ఎస్టీ రిజర్వేషన్ రావటానికి ప్రధాన కారకులు రాఘవయ్య పంతులు అని తెలిపారు. గిరిజన జాతుల జీవితాలను అతలాకుతలం చేసిన నేరసజాతుల నిర్బంధం చట్టాన్ని (సిటి యాక్ట్) దేశవ్యాప్తంగా రద్దు చేయించి, రెండు వందల గిరిజన తెగలను విముక్తి చేయించిన ఘనత రాఘవయ్యకు దక్కుతుందన్నారు. గిరిజనులు చదువుకోవటానికి హాస్టల్స్, స్కూల్స్, బాల్వాడీ మొదలైనవి నడిపారని, సిటీ యాక్ట్ కేసుల్ని ఉచితంగా వాదించాడని తెలిపారు. రాఘవయ్య సేవలను స్టేద్వా కొనసాగిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో యం.కిషోర్‌బాబు, సిహెచ్.రాము, టి.ఉమామహేశ్వర రావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్ ఏర్పాటు

ప్రజాశక్తి - పెదనందిపాడు

ప్రకృతి వ్యవసాయ ప్రోత్సాహంలో భాగంగా ఉత్పత్తుల విక్రయ కేంద్రాలను ప్రతి సోమవారం ఏర్పాటు చేస్తున్నా మని ఏపీసీఎన్ఎఫ్ ట్రైనర్ ఇంచార్జ్ సిహెచ్ వరప్రసాద్ తెలిపారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌లో రూ. 800 కూరగాయలు విక్రయించినట్లు తెలిపారు. రసాయనిక ఎరువులు, పురుగుమందులు వాడకుండా కేవలం కషాయాలు వాడి ఈ ఉత్పత్తులను మహిళా సంఘాలు పండిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్చార్జ్ లు ఎం లక్ష్మి, ఎన్ ప్రశాంతి పాల్గొన్నారు.

నియామకాల్లో ప్రాధాన్యమివ్వాలి

వర్సిటీ జగ్జీవన్‌రామ్ చైర్‌ను సందర్శించిన లిడ్‌క్యాప్ చైర్మన్

ప్రజాశక్తి - ఏఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని బాబు జగజీవన్ రామ్ చైర్‌ను సోమవారం ఏపీ లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్య రావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన జగజీవన్ రామ్ చైర్ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు. ఈ చైర్ నుంచి శిక్షణ తరగతులు నిర్వహించాలని సూచించారు. అనంతరం చైర్ ప్రొఫెసర్ ఆచార్య పి .రత్నాకర్‌తో కలిసి వీసీ ప్రొఫేసర్ కె.గంగాధర రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనతో మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో మాదిగలకు గుర్తింపు ఇవ్వాలని, ఉద్యోగ నియామకాల్లో ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ఈ సందర్భంలో డాక్టర్ గంగాధర్, డాక్టర్ ఇశ్రాయేల్ , డాక్టర్ సాంబశివరావు, డాక్టర్ రవిబాబు, పరిశోధకులు పిడతల అభిషేక్, సునీల్, శాస్త్రి, కుటుంబరావు, రోహిణి, సాంసన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అవకతవకలపై ఫిర్యాదు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రత్తిపాడు వెలుగు క్రాంతి పథం లోని మండల సమైక్య లో జరిగిన ఆర్థిక అవకతవకల గురించి సోమవారం ప్రజా సమస్యల ఫిర్యాదుల వేదిక లో ప్రత్తిపాడు మండలం లోని గోట్టిపాడుకు చెందిన సామాజిక వేత్త శివ కుమారి పిర్యాదు చేశారు. గతం లో ఏం ఎస్ నుండి అప్పటి సీసీ 8 లక్షల చెక్కు విత్ డ్రా చేసుకొని వెళ్లిపోగా ఆ తర్వాత రూ.లక్ష యాభై వేలు కట్టారని, మిగిలిన సొమ్ము కట్టలేదన్నారు. వాటిని రికవరీ చేసి పేదలకు అందించాలని అలాగే గోట్టిపాడు లోని శ్రీ సత్యనారాయణ స్వామి యానిటర్ ఎస్ హెచ్ జి కు చెందిన పదకొండు మందికి ఉన్న అప్పుకు ట్యాగ్ కావాల్సిన రూ.లక్ష పదిహేడు వేలు ఇతర యానిమేటర్‌కి ట్యాగ్ అయ్యాయని అవికూడా రికవరీ ఎందుకు చేయలేదని ఫిర్యాదు చేశారు.

వేపగింజల ద్రావణం తయారీపై అవగాహన

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రత్తిపాడు నియోజక వర్గం పరిధిలోని వట్టిచెరుకూరు గ్రామంలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఈ గ్రామీణ అవగాహనన కృషీ అనుభవ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. రైతులకు వేపగింజల ద్రావణం తయారీ విధానాన్ని చేసి చూపించారు. ఈ ద్రావణాన్ని 5 శాతం మిరప పంటలో ఉపయోగించడం వలన పంట రసం పిల్చుకుని పురుగుల బెడద తగ్గుతు ందన్నారు. అదే విధంగా కూరగాయల పంటల్లో కూడా ఈ ద్రావణాన్ని ఉపయోగిస్తే మంచి దిగుబడులు వచ్చి రైతులకు లాభం చేకురుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నులు. రైతులు తదితరులు పాల్గొన్నారు.

పని వత్తిడి తగ్గించాలని వినతి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

సాంకేతిక కానీ పనుల నుండి ఒత్తిడి తగ్గించాలని సోమవారం ప్రత్తిపాడు మండల అభివృద్ధి అధికారి కోడూరి శివ పార్వతికి మండలం లోని 13 సచివలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోయేషన్ ఆఫ్ సెక్రటేరియట్ ఇంజినీర్స్ మండల ప్రసిడెంట్ సీహెచ్ ప్రసాద్ మాట్లాడుతూ మాకు కేటాయించిన పనుల్లో భాగంగా సాంకేతిక పనుల కాకుండా జియో ట్యాగింగ్, ఎన్ పి సీ ఐ లికింగ్, స్వర్ణ పంచాయతీ డేట ఎంట్రీ, బి ఎల్ఒ లాంటి పనులు అదనంగా కేటాయించడం వలన, మేము చేయవలసిన పనులు పెండింగ్ పడుతున్నా యన్నారు. దీనివలన మండలంలో గ్రోత్ రాకపోవడం, టార్గెట్‌లు రీచ్ చేయలేకపోతున్నామన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో జనరల్ సెక్రటరీ రామ చంద్ర రావు, నిఖిల్, లావణ్య, తేజస్విని, నాగరాజు, ఆనంద్ ఉన్నారు.

చలితో జాగ్రత్త సుమా..!

యుపిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనూష

ప్రజాశక్తి - మంగళగిరి



చలికాలంలో ఎన్నో ఆరోగ్య సమస్యలు వస్తాయని, ప్రజలు చలి నుండి శరీరాన్ని కాపాడు కుంటూ, తగు జాగ్రత్తలు పాటిస్తూ, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మంగళగిరి గణపతి నగర్లోని ఇందిరానగర్ యూపీహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పీ అనూష తెలిపారు. సోమవారం మీడియాతో మాట్లాడారు. చలి కాలంలో వచ్చే ఆరోగ్య సమస్యలు, వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆమె వివరించారు. శీతాకాలంలో దగ్గు, జలుబు, గొంతు నొప్పి, వైరల్ జ్వరాలు, ఆస్తమా, చర్మం పొడిబారి పోవడం వంటివి ఎక్కువగా వస్తాయన్నారు. చలికాలంలో శరీరంలో నీటి శాతం తగ్గినప్పుడు శరీరం డ్రైగా మారి, చర్మం పొడి బారిపోవడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు ఎక్కువగా నీరు తాగి, ద్రవపదార్థాలు తీసుకోవాలన్నారు. గోరువెచ్చటి నీటితో స్నానం చేయాలన్నారు. పొడి బారిన చర్మంకు మాయిశ్చరైజింగ్ క్రిములు, కొబ్బరి నూనె రాయాలన్నారు. చలికాలంలో రక్తనాళాలు, ధమనులు సంకోచించి బీపీ పెరిగి గుండెపోటుకు గురయ్యే ప్రమాదాలున్నాయన్నారు. కూరగాయలు, పండ్లు తీసుకుంటూ కొవ్వులు, పాల ఉత్పత్తులు, మాంసం, తక్కువగా తీసుకోవాలన్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు, ఆస్తమా రోగులు మంచు పడే సమ యంలో బయటికి వెళ్లకుండా ఉండాలన్నారు. చలి నుండి రక్షణ పొందటానికి ఉన్ని దుస్తులు, స్వెటర్లు, మాస్కులు, మఫ్లర్లు వాడాలన్నారు. ఉదయం సూర్యోదయం తర్వాత వాకింగ్, వ్యాయామం చేసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులతో బాధపడేవారు ప్రభుత్వం అందించే ఉచిత వైద్య సేవలను పొందాలని డాక్టర్ అనూష విజ్ఞప్తి చేశారు.

29న తుళ్లూరులో సిపిఎం రాజధాని డివిజన్ మహాసభ

ప్రజాశక్తి - తుళ్లూరు

సిపిఎం పార్టీ రాజధాని డివిజన్ మూడవ మహాసభ ఈనెల 29వ తేదీన తుళ్లూరులో నిర్వహించనున్నట్లుగా సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి సోమవారం తెలిపారు. మహాసభలో రాజధాని లోని వివిధ గ్రామాల నుండి సిపిఎం నాయకులు, కార్యకర్తలు ప్రతినిధులుగా పాల్గొంటారని తెలిపారు. రాజధాని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ కర్తవ్యాలను మహాసభలో నిర్ణయిస్తామని రవి తెలిపారు. మహాసభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబురావు, సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై నేతాజీ, ఈమని అప్పారావు పాల్గొంటారని తెలిపారు.



గుండెపోటుతో ఎంపిహెచ్‌ఇఒ మృతి


నివాళులర్పించిన కార్యాలయ సిబ్బంది

ప్రజాశక్తి - తుళ్లూరు

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య విస్తరణా ధికారి (ఎంపి హెచ్ ఇఒ)గా పనిచేస్తున్న వజ్రాల బ్రహ్మారెడ్డి ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. బ్రహ్మారెడ్డి సంస్మరణ సభ సోమవారం ప్రాథమిక ఆరోగ్యకేం ద్రంలో జరిగింది.బ్రహ్మారెడ్డి ఆరోగ్య విస్తరణాధికారి గా 2011 నుండి నిబద్ధతతో పనిచేశారని, ఆయన ఆకస్మిక మతి బాధాకర మని వైద్యాధికారులు డాక్టర్ వసుంధర,శివ పార్వతి నివాళి అర్పించారు.కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సి హెచ్ ఓ వెంకటరమణ,ఎం ఎస్ రాణి,నాగమ్మ, విజయ కుమారి,శ్రీనివాసరెడ్డి,కరీం, లక్ష్మీ నారాయణ, ఎ ఎన్ ఎమ్ లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి నేత దామర్ల శివరామకృష్ణ మృతి

ప్రజాశక్తి - మంగళగిరి



తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మంగళగిరి శివాలయం ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ దామర్ల శివరామకృష్ణ (87) సోమవారం మృతిచెందారు. అనారోగ్యంతో విజయ వాడలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయ రావు, టిడిపి నాయకులు సంతాపం తెలియజేశారు.

రీ ఓపెన్ అర్జీలపై శాఖలవారీగా సమీక్షించండి

అధికారులకు పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



ప్రజా సమస్యల పరిష్కార వేదిక రీ ఓపెన్ అర్జీలపై జిల్లా అధికారులు శాఖల వారీగా సమీక్షలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ లో రీ ఓపెనింగ్ ఫిర్యాదులపై జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో మొత్తం 48 రీ ఓపెన్ అర్జీలను నిశితంగా పరిశీలించారు. జిల్లా అధికారులు క్షేత్ర స్థాయి అధికారులకు అర్జీదారులతో వ్యవహరించే తీరు, పరిష్కారాలను ఆన్ లైన్‌లో అప్ లోడ్ చేసే విధానంపై శిక్షణ ఇవ్వాలన్నారు. అర్జీదారులతో నేరుగా మాట్లాడటం, క్షేత్ర స్థాయి విచారణ చేపట్టడం, అర్జీదారులతో ఫోటోలు అప్ లోడ్ చేయించడం తప్పనిసరి అన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే, డీఆర్వో మురళి, జిల్లా అధికారులు, ఆర్డీఓలు, మండల ప్రత్యేక అధికారులు డి.ఎల్.డి.ఓలు తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీలో నేటి నుండి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈ నెల 26 నుంచి డిసెంబర్ 3వ తేదీ వరకు దక్షిణ మరియు పశ్చిమ మండల అంతర్ విశ్వవిద్యాలయాల స్త్రీ పురుషుల, వెయిట్ లిఫ్టింగ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు పోటీల నిర్వహక కార్యదర్శి, వ్యాయామ విద్య డైరెక్టర్ ప్రొఫెసర్ పి పి ఎస్ పాల్ కుమార్ వివరాలను విలేకరులకు తెలిపారు. ఈ పోటీలు మహిళలకు నేటి నుండి 28 వరకు, పురుషులకు 30వ తేదీ నుంచి డిసెంబర్ 3వ వరకు జరుగుతాయని తెలిపారు. ఈ పోటీలకు 125 విశ్వవిద్యాలయాలు తమ పేర్లు నమోదు చేసుకున్నాయని, 400 మంది మహిళ వెయిట్ లిఫ్టర్ లు ఈ పోటీలలో పాల్గొంటారన్నారు. పోటీలను పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ప్రారంభిస్తారని చెప్పారు. ప్రత్యేక ఆహ్వానితులుగా అర్జున అవార్డు గ్రహీత నీలంశెట్టి లక్ష్మి, ఇండియన్ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ వైస్ ప్రెసిడెంట్ బడేటి వెంకటరామయ్య, యూనివర్సిటీ అధికారులు, టెక్నికల్ అఫీషియల్స్ పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీలకు వీసీ ప్రొఫెసర్ కే. గంగాధర రావు ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్‌గా ఉన్నారని పాల్ కుమార్ వివరించారు.



హాజరు అయిన నిరుద్యోగులు

జాబ్ మేళాలు కొనసాగిస్తాం : ఎమ్మెల్యే మాధవి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులో జాబ్ మేళాలు కొనసాగించి నిరుద్యోగులకు తగిన ఆసరా కల్పిస్తామని ఎమ్మెల్యే గల్లా మాధవి తెలిపారు. సోమవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో నిర్వహించిన ఈ జాబ్ మేళాకు హెచ్ ఆర్ అండ్ కో తరపున 5 కంపెనీల ప్రతినిధులు వచ్చారు. సుమారు 50 మంది నిరుద్యోగులు తమ పేర్లను నమోదు చేసుకొని ఇంటర్వ్యూకు హాజరయ్యారు. ఈ ఇంటర్వ్యూలో సుమారు 30 మంది సెలెక్ట్ అయ్యారని, వారికి ఆఫర్ లెటర్ ఇస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా, నియోజకవర్గంలో ప్రతి డివిజన్ వారీగా నిరుద్యోగులను గుర్తించి, వారి వివరాల్ని ఆన్లైన్ లో రిజిస్టర్ చేయించి ప్రతి 15 రోజులకి ఒకసారి జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని, దీని కోసం తన కార్యాలయంలో ఒక విభాగాన్ని ఏర్పాటు చేసి, నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గల్లా మాధవి హామినిచ్చారు.

పోలీసులపై న్యాయపోరాటం : అంబటి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



ఎస్‌పి ని కలిసినన అంబటి, వైసిపి నాయకులు

సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెట్టారన్న కారణంగా తమ పార్టీ కార్యకర్తలను అరెస్టు చేయడంలో చూపిస్తున్న ఉత్సాహం టిడిపి కార్యకర్తల అరాచకాలపై మాత్రం మిన్నకుండి పోతున్నారని మాజీ మంత్రి అంబటి రాంబాబు ధ్వజమెత్తారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి సతీష్‌కుమార్‌ను కలిసి తాము గతంలో చేసిన ఫిర్యాదులపై ఎటువంటి చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. తమ పార్టీ నేతలపై టిడిపి వారు పెట్టిన పోస్టింగ్‌లకు సంబంధించి పలు స్టేషన్లలో ఫిర్యాదులు చేశామని కానీ ఇంత వరకు అధికారులు స్పందించడం లేదని ఆయన ఎస్‌పి దృష్టికి తీసుకువచ్చారు. మాజీ సిఎం జగన్ కుటుంబ సభ్యులపై టిడిపి వారు పెడుతున్న పోస్టింగ్‌లపై తక్షణం చర్యలు తీసుకోవాలని లేదంటే తాము న్యాయపోరాటం చేస్తామని తెలిపారు. తనపై అసభ్య పదజాలంలో అనేక పోస్టింగ్‌లు పెడితే ఇంత వరకు టిడిపి వారిపై చర్యలు లేవన్నారు. పోలీసులు స్పందించకుంటే న్యాయ వ్యవస్థలను ఆశ్రయిస్తాం అన్నారు. వైసిపి నాయకులు వనమా బాల వజ్ర బాబు (డైమండ్ బాబు), నిమ్మకాయల రాజు నారాయణ, పోలూరి వెంకట్ రెడ్డి, బైరెడ్డి రవీంద్ర రెడ్డి, నూనె ఉమామహేశ్వర్ రెడ్డి,కార్పొరేటర్లు మల్లవరపు రమ్య, బూసి రాజ్యలత, వెంకట కృష్ణమాచారి (ఆచారి), షేక్ రోషన్, షేక్ మహమూద్, యాట్ల రవి కుమార్, పోల్వరపు జ్యోతి , మొహమ్మద్ అబిద్ భాష, ధూపాటి వంశీ బాబు,అచ్చాల వెంకట రెడ్డి, పునూరీ నాగేశ్వరరావు, తుమ్మేటీ శ్రీనివాసరావు, మొండితోక శ్రీనివాసరావు, అగ్గిపెట్ట రాజు పాల్గొన్నారు.

వికలాంగుల వద్దకు వెళ్లి వినతులు స్వీకరించిన కలెక్టర్

కలెక్టర్ గ్రీవెన్స్‌కు 166 అర్జీలు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్‌లో ఇచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి నిర్లిప్తత చూపకుండా వాటిని గుణాత్మకంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి అధికారులకు సూచించారు. సోమవారం కలక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ, డిఆర్ఓ ఖాజావలి, డిప్యూటీ కలెక్టర్లు లక్ష్మీకుమారి, గంగరాజు, గుంటూరు ఆర్డీఓ కే.శ్రీనివాసరావు ప్రజల నుండి 166 ఫిర్యాదులను స్వీకరించారు. తమ సమస్యల పరిష్కారానికి పిటిషన్లు ఇవ్వడానికి వచ్చిన వికలాంగులు శాసన పాములు, పులిపాక శివ కుమార్ వద్దకు కలెక్టర్ స్వయంగా వెళ్లి అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసు కొని పరిష్కార చర్యలు తీసుకోవడం జరుగుతుందని వారికి కలెక్టర్ భరోసా కల్పించారు.

ప్రొటోకాల్ తప్పక పాటించాలి..

ఇటీవల జెడ్పీ సర్వసభ్య సమావేశంలో ప్రోటోకాల్ పాటించట్లేదని, సమాచారం ఇవ్వట్లేదని, శిలఫలకాలపై పేర్లు వేయట్లేదని ప్రజా ప్రతినిధులు సమావేశం దృష్టికి తెచ్చిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ అధికారుల్ని ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వం ప్రోటోకాల్‌కు సంబంధించి స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసి వున్నందున, అధికారులు తప్పని సరిగా ప్రోటోకాల్ పాటించాల్సిందే అని జిల్లా కలెక్టరు అధికారులకు సూచించారు.



వికలాంగుల నుండి అర్జీలు తీసుకుంటున్న జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

కాలేజీలో సర్టిఫికెట్లు ఇప్పించాలి

సర్టిఫికెట్లు ఇవ్వకుండా కాలేజి యాజమాన్యం ఇబ్బంది పెడుతుందని, మా కుమారుడి సర్టిఫికెట్లు ఇప్పించాలని దుగ్గిరాల మండలం, తుమ్మపూడికి చెందిన జెట్టి బాలరాజు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చాడు. తమ కుమారుడు జెట్టి అజయ్ 2018-2020 వరకూ అవనిగడ్డ మండలం, దివిసీమ కాలేజిలో చదివాడని, అయితే ఆర్థిక పరిస్థితి బాగోలేక రెండేళ్లకు చదువు మానేశాడని తెలిపారు. మొదటి రెండేళ్ల ఫీజు రియంబర్స్‌మెంట్ వచ్చిందన్నారు. చివరి సంవత్సరం ఫీజు రియంబర్స్‌మెంట్ వచ్చిందో లేదో సరైన సమాచారం కాలేజి యాజమాన్యం చెప్పట్లేదన్నారు. మా కుమారిడి మాదిరిగా అనేక మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారన్నారు. ఒక్కొక్కరూ రూ.30వేలు నుండి రూ.40వేలు కడితేనే సర్టిఫికెట్లు ఇస్తామని చెబుతున్నారని, కావున ఫీజు రియంబర్స్ మెంట్‌పై సరైన సమాచారం ఇప్పించాలని, అలాగే సర్టిఫికెట్లు కూడా ఇప్పించాలని కోరారు.

సమగ్ర కులగణన చేపట్టాలని బిసి సంక్షేమ సంఘం వినతి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తలపెట్టిన జనగణనతోపాటు, సమగ్ర కుల గణన చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ సంఘం నాయకులు గ్రీవెన్స్‌లో అర్జీ అందజేశారు. ఈ సందర్భంగా బిసి సంక్షేమ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మర క్రాంతికుమార్, జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్ మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కులగణన చేస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక ఆ ఊసే ఎత్తట్లేదన్నారు. వెనుకబడిన తరగతుల అభివృద్ధికి, రిజర్వేషన్లపై ఆచరణాత్మక విధానాల రూపకల్పనకు, తప్పనిసరిగా కులగణన జరగాలన్నారు. 52 శాతంగా ఉన్న బిసిలకు జనాభా దామాషా ప్రకారం కేటాయింపులు జరగట్లేదన్నారు. కేటాయించిన నిధులూ పూర్తిగా ఖర్చు చేయట్లే దన్నారు. బిసిలకు మోడీ అన్యాయం చేశారన్నారు.రాష్ట్ర స్థాయిలో కులగణన జరిగిన తర్వాతే స్థానిక సంస్థలకు ఎన్నికలు జరపాలన్నారు. కులగణన చేపట్టకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.నాగమల్లేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ కోలా అశోక్, జిల్లా కోఆర్డినేటర్ కె.స్వాతి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సౌకర్యం కల్పించాలి

జిఎంసి గ్రీవెన్స్‌కు 41 అర్జీలు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగర ప్రజల సమస్యల సత్వర పరిష్కారం కొరకు నగర పాలక సంస్థ కాల్ సెంటర్ 0863-2345103, 104, 105 నెంబర్లకు కాల్ చేసి ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. సోమవారం కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్లో గ్రీవెన్స్ నిర్వహించారు.డయల్ యువర్ కమిషనర్ ద్వారా ఫోన్‌లో 20 అర్జీలు, గ్రీవెన్స్‌లో నేరుగా41 అర్జీలు స్వీకరించారు. ప్రజలు జిఎంసి కాల్ సెంటర్‌కు ప్రతి రోజు ఉదయం 8 గంటల నుండి నుండి రాత్రి 8 గంటల వరకు ఆస్తి పన్ను మార్పు, ఆస్తి పన్ను విధింపు, నీటి కుళాయిల కనెక్షన్ లు, కుళాయిల రిపేర్లు, డ్రైన్ కనెక్షన్లు, రిపేర్లు, ట్రేడ్ లైసెన్సులు, జనన, మరణ ధ్రువ పత్రాల మార్గ దర్శకాలు, వివాహ పత్రాల నమోదు తదితర స్థానిక సమస్యలపై ఫిర్యాదు చేయొచ్చన్నారు. గ్రీవెన్స్‌లో డిప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, డి.శ్రీనివాసరావు, సిటి ప్లానర్ రాంబాబు, సిఎంఓహెచ్ డాక్టర్ శోభారాణి, మేనేజర్ బాలాజీ బాష తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

రత్నగిరి నగర్ ప్రజల దాహార్తిని తీర్చాలి

గుంటూరు, పలకలూరు రోడ్డులోని రత్నగిరి నగర్‌లో నివశిస్తున్న పేదలకు త్రాగునీటి కుళాయిలు మంజూరు చేయాలని కోరుతూ కాలనీ ప్రజలు సోమవారం జిఎంసి గ్రీవెన్స్‌లో అర్జీ అందచేశారు. కాలనీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ కులస్తులు 200 పైగా కుటుంబాలు వారు గత 30 సంవ త్సరాల నుండి నివాసం ఉంటున్నామని, రోజువారి కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నామని, మంచినీటి సౌక ర్యం లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. మున్సిపల్ వాటర్ ట్యాంక్ 10 రోజులకు ఒకసారి వస్తుందని, ఒక్కొక్క ఇంటికి డ్రమ్ము నీరు మాత్రమే వస్తుందని, ఇవి సరి పోవట్లేదన్నారు. ఇంటింటికి కొళాయి కలెక్షన్ ఇవ్వాలని వారు కోరారు. తొలుత కలెక్టరేట్ వద్ద, జిఎంసి కార్యాలయం వద్ద ప్రజలు నిరసన తెలిపారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి కెశ్రీనివాసరావు నగర ఉపాధ్యక్షులు ఎస్.కె కాసిం వలి స్థానికులు సైదా, లక్ష్మణరావు మౌలాలి, వెంకటమ్మ, బుజ్జి సౌభాగ్యం తదితరులు ఉన్నారు.



నిరసన తెలియజేస్తున్న రత్నగిరి నగర్ ప్రజలు

రోడ్లపై సంచరించే పశువులను గోశాలకు తరలిస్తాం

ప్రజాశక్తి-గుంటూరు

నగరంలో రోడ్లపై సంచరించే ఆవులు, ఎద్దులు, గేదెలను సంబంధిత యజమానులు సొంత ఆవరణలోనే పెంచుకోవాలని, అలా కాకుండా రోడ్లమీదకు వదిలితే వాటిని జిఎంసి ప్రజారోగ్య సిబ్బంది బంధించి గోశాలకు తరలిస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. గోశాలకు తరలించిన పశువులను యజమానులకు ఇచ్చేందుకు ఒక్కో పశువుకి తొలుత రూ.1000ల అపరాధ రుసుం, గోశాలకు తరలించిన నాటి నుండి రోజుకి రూ.300 చెల్లించాలని, అది కూడా గోశాలకు తరలించిన 10 రోజులలోపు మాత్రమే అమలులో ఉంటుందన్నారు. యజమానులు తీసుకెళ్లని పశువులను ఆంధ్రప్రదేశ్ నగరపాలక సంస్థ చట్టం 1955 సెక్షన్ 510 ప్రకారం గోశాలకు తరలించిన 10 రోజులలోపు యజమానులు స్పందించకుంటే వాటిని వేలం నిర్వహించి, వేలం ద్వారా వచ్చిన నగదుని జిఎంసి ఖజానాకు జమ చేస్తామన్నారు.

కార్మికుడి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా అందచేత

విధి నిర్వహణలో మరణించిన కార్మికుల కుటుంబాలకు నగరపాలక సంస్థ అండగా ఉంటుందని నగర కమిషనర్ పేర్కొన్నారు. ఇటీవల ఇంజినీరింగ్ విభాగం ఎల్ఎల్ఆర్‌లో ఆప్కాస్ విధానంలో పనిచేస్తూ మృతి చెందిన షేక్ ఉమర్ కుటుంబ సభ్యులు షేక్ ముంతాజ్ బేగంకు రూ.2 లక్షల ఎక్స్ గ్రేషియా, మట్టి ఖర్చులు రూ.15వేలను కమిషనర్ సోమవారం తన ఛాంబర్‌లో అందించారు.